**ప్రజలకు / పాఠకులకు ముఖ్య విజ్ఞప్తి**

"ప్రజాప్రశ్న" దినపత్రిక పేరు చెప్పుకొని ఎవరైనా డబ్బులు, విరాళాలు, ప్రకటనల పేరుతో నగదు లేదా ఇతర రూపంలో డిమాండ్ చేస్తే దయచేసి నమ్మవద్దు.

అలాంటి వ్యక్తుల వివరాలను వెంటనే మా దృష్టికి తీసుకురండి. ప్రజల ఫిర్యాదు అందిన వెంటనే సంబంధిత వ్యక్తులపై పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుంది.

- ప్రజాప్రశ్న యాజమాన్యం

PRAJA PRASHNA

# ప్రజాప్రశ్న

RNI : TELTEL/2021/80267 తెలుగు దినపత్రిక

సంపుటి: 6 సంచిక: 45, పేజీలు - 08

సోమవారం, ఆగష్టు 10, 2026 వెల: 5 రూ/.

హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD




# కలవరం.. ఎల్ నినో ప్రభావం

## - నీటి ఇబ్బందులు తప్పవా..?

- తెలుగు రాష్ట్రాలపై పడుతున్న ఎఫెక్ట్
- ప్రాజెక్టులకు వరద నీరు
- సాగునీటికి ప్రాధాన్యం లేదు



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) ఎల్ నినో ప్రభావం తెలుగు రాష్ట్రాలపై పడుతోంది. ప్రాజెక్టులకు వరద నీరు చేరుతున్నప్పటికీ వాటిని వదిలే విషయంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రభుత్వాలకు పెద్ద టాస్క్ కానుంది. ఇప్పుడున్నపరిస్థితుల్లో సాగునీటికి ప్రాధాన్యం ఇచ్చే అవకాశం లేదు. కేవలం తాగునీరు, పశువులకు మాత్రమే అందించగలుగుతామని అధికారులు స్పష్టం చేస్తున్నారు. ఎల్ నినో ఎఫెక్ట్ తో ఈసారి రెండు రాష్ట్రాలు రైతులు ఇబ్బందులు పడే అవకాశాలున్నాయి. శ్రీశైలం ప్రాజెక్టుకు వరద నీరు చేరుతున్నప్పటికీ ఇంకా పూర్తి స్థాయి నీటి మట్టానికి చేరుకోలేదు. అదే సమయంలో గేట్లు కూడా ఎత్తలేదు. దీంతో జలవిద్యుత్తు కూడా ఇప్పటి వరకూ శ్రీశైలం ఎడమ, కుడి జల విద్యుత్తు కేంద్రాల్లో ప్రారంభం కాలేదు.

2లో..

## 'హర్ ఘర్ తిరంగా'లో

# ఉత్సాహంగా పాల్గొనండి

## - దేశ ప్రజలకు ప్రధాని మోదీ పిలుపు



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** భారతదేశం 80వ స్వాతంత్ర్య దినోత్సవ సంబరాలకు సిద్ధమవుతున్న వేళ దేశ ప్రజలంతా 'హర్ ఘర్ తిరంగా' ఉద్యమంలో ఉత్సాహంగా పాల్గొనాలని ప్రధాని నరేంద్ర మోదీ శనివారం పిలుపునిచ్చారు. మన త్రివర్ణ పతాకం దేశానికి గర్వకారణం మాత్రమే కాకుండా, దేశం కోసం ఎప్పటికప్పుడు అత్యుత్తమంగా పనిచేయాలనే స్ఫూర్తిని అందించే శక్తి అని మోదీ అభివర్ణించారు. ఆదివారం రోజు సోషల్ మీడియా ప్లాట్‌ఫాం ఎక్స్‌లో ప్రధాని నరేంద్ర మోదీ ఈ సందేశం ఇచ్చారు. హర్ ఘర్ తిరంగా క్యాంపెయిన్‌లో ఉత్సాహంగా పాల్గొని, వికసిత్ భారత్ నిర్మాణానికి తమ వంతు సహకారం అందించాలన్న సంకల్పానికి కట్టుబడి ఉండాలని ప్రజల్ని కోరారు. ప్రతి ఇంటా జాతీయ జెండా ఎగురవేయాలని అభ్యర్థించారు. ఇంకా ఈ ఏడాది హర్ ఘర్ తిరంగా ప్రచారానికి ఒక ప్రత్యేకత ఉందని మోదీ పేర్కొన్నారు. మన జాతీయ గేయం వందేమాతరం రూపకల్పన జరిగి 150 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా ఈ వేడుకల్ని వందేమాతరానికి అంకితం ఇవ్వడం గర్వకారణమని వెల్లడించారు.

2లో..

## పెద్ది కుటుంబానికి

# కేసీఆర్ పరామర్శ

## - రూ.2.25 కోట్ల ఆర్థిక సాయం అందజేత

- నల్లబెల్లిలో దివంగత ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి దశదినకర్మ
- సుదర్శన్‌రెడ్డితో అనుబంధాన్ని గుర్తుచేసుకుని భావోద్వేగం
- పార్టీ అండగా ఉంటుందని కుటుంబానికి భరోసా



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే, తెలంగాణ ఉద్యమకారుడు పెద్ది సుదర్శన్‌రెడ్డి కుటుంబాన్ని ఆ పార్టీ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ పరామర్శించారు. ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన పెద్ది సుదర్శన్‌రెడ్డి దశదిన కార్యక్రమం సందర్భంగా ఆదివారం వరంగల్ జిల్లా నల్లబెల్లిలోని ఆయన స్వగృహానికి కేసీఆర్ వెళ్లారు. పెద్ది సుదర్శన్ రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం కుటుంబ సభ్యులతో మాట్లాడారు. పెద్ది సుదర్శన్‌రెడ్డి మృతితో

2లో..

## నల్సార్ స్నాతకోత్సవానికి

# సీజేఐ వద్దు

## - 450 మంది విద్యార్థుల నిరసన!



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) హైదరాబాద్‌లోని ప్రతిష్ఠాత్మక నల్సార్ యూనివర్సిటీ ఆఫ్ లా స్నాతకోత్సవానికి భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్‌ను ముఖ్య అతిథిగా ఆహ్వానించడాన్ని వ్యతిరేకిస్తూ విద్యార్థులు నిరసన గళం విప్పారు. ఈ మేరకు దాదాపు 450 మంది విద్యార్థులు సంతకాలు చేసి విశ్వవిద్యాలయ యాజమాన్యానికి ఒక లేఖ రాశారు. ఈ పరిణామం తెలంగాణ న్యాయ విద్యా వర్గాల్లో

2లో..

## జాతీయ జెండాతో పాటు

# మీ అజెండా ఉండాలి

## ఆదివాసీ దినోత్సవం కార్యక్రమంలో సీఎం చంద్రబాబు

- ప్రతి ఒక్కరూ వ్యక్తిగత బాధ్యత తీసుకోవాలని సీఎం పిలుపు
- జీవో నెంబర్ 3ను చట్టపరంగా కాపాడతామని ఆదివాసులకు భరోసా
- అరకు కాఫీ తరహాలో స్థానిక గిరిజన ఉత్పత్తులకు గ్లోబల్ బ్రాండింగ్





**అమరావతి (ప్రశ్న న్యూస్)** అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవం వేదికగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు ఒక స్ఫూర్తిదాయక ప్రసంగం చేశారు. దేశభక్తి అంటే కేవలం సరిహద్దుల్లో పోరాడటం మాత్రమే కాదని, ప్రతి పౌరుడు తన వృత్తిలో విజయం సాధించి, సమాజానికి సేవ చేయడమే నిజమైన దేశభక్తి అని ఉద్బోధించారు. ప్రతి ఒక్కరూ తమకంటూ ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకుని, దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఆదివాసీ

2లో..

## పాతబస్తీ బరాబర్

# హిందువులదే

## - భాగ్యలక్ష్మి ఆలయాన్ని గోల్డెన్ టెంపుల్‌గా మారుస్తామన్న బండి



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** హైదరాబాద్ పాతబస్తీలో లాల్‌దర్వాజా బోనాల ఉత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. ఆషాఢ మాస బోనాల సందర్భంగా కేంద్రమంత్రి బండి సంజయ్ లాల్‌దర్వాజా సింహవాహిని మహంకాళి అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారికి బంగారు బోనం సమర్పించిన బండి సంజయ్ ప్రత్యేక పూజలు చేశారు. ఆ తర్వాత ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వస్తే చార్మినార్ వద్ద ఉన్న భాగ్యలక్ష్మి అమ్మవారి ఆలయాన్ని గోల్డెన్ టెంపుల్‌గా అభివృద్ధి చేస్తామని బండి సంజయ్ కీలక ప్రకటన చేశారు.పాతబస్తీలో బోనాల ఉత్సవాలను మరింత ఘనంగా నిర్వహించడంతో పాటు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పిస్తామని చెప్పారు. ఉత్సవాల నిర్వహణకు భారీగా నిధులు కేటాయిస్తామని తెలిపారు. ఈ క్రమంలోనే 2029లో తెలంగాణలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడుతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బోనాలను రాష్ట్ర పండుగగా ప్రకటించిన ప్రభుత్వం ఉత్సవాల నిర్వహణకు తగిన స్థాయిలో నిధులు కేటాయించడం లేదని బండి సంజయ్ తీవ్రంగా విమర్శించారు. లాల్‌దర్వాజా బోనాలకు ప్రభుత్వం కేటాయించిన నిధులు సరిపోవని పేర్కొన్నారు. ఇతర పండుగలకు కేటాయించే నిధులతో పోలిస్తే బోనాలకు తక్కువ ప్రాధాన్యం ఎందుకు ఇస్తున్నారని ప్రశ్నించారు. అలాగే గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఆలయాల అభివృద్ధికి ఇచ్చిన హామీలు అమలు కాలేదని

2లో..

## మృత్యువుతో పోరాడి ఓడిన

# మెడికో ప్రియాంక

- చికిత్స పొందుతూ కన్నుమూత
- మరణాన్ని ధ్రువీకరించిన వైద్యులు
- సీఎం చంద్రబాబు సంతాపం
- ఆమె కుటుంబానికి రూ.20 లక్షల సాయం



అమరావతి (ప్రశ్న న్యూస్) రాజమండ్రిలో ఈ నెల 3వ తేదీన యువకులు కారుతో ఢీ కొట్టిన ఘటనలో మెడికల్ స్టూడెంట్ ప్రియాంక ప్రాణాలు కోల్పోవడం బాధాకరం అని ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు. ఇటీవల జరిగిన హిట్ అండ్ రన్ కేసులో తీవ్రంగా గాయపడిన ప్రియాంక మృతి చెందిందనే వార్త తీవ్రంగా కలిచివేసిందన్నారు. ఎంతో భవిష్యత్ ఉన్న ఒక వైద్య విద్యార్థిని ప్రాణాలు

2లో..

## హైదరాబాద్‌లో ట్రాఫిక్ రద్దీకి చెక్

### - సిమ్యులేషన్ అధ్యయనానికి హెచ్ఎండీఏ సిద్ధం



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) హైదరాబాద్ మహానగరంలో రోజురోజుకూ పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యకు శాస్త్రీయ పరిష్కారం కనుగొనే దిశగా హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ అడుగులు వేస్తోంది. నగరంలో రద్దీకి అసలు కారణాలు ఏమిటి? ఎక్కడ మౌలిక వసతులు మెరుగుపర్చాలి? ఎలాంటి ప్రత్యామ్నాయ చర్యలు చేపడితే ట్రాఫిక్ ఒత్తిడి తగ్గుతుంది? వంటి అంశాలను ముందుగానే అంచనా వేసేందుకు ట్రాఫిక్ సిమ్యులేషన్ విధానంలో అధ్యయనం చేయాలని నిర్ణయించింది.

2లో..

# నాపై జరిగిన దాడిలో చనిపోయి ఉండేదాన్ని

- పశ్చిమ బెంగాల్‌లో మమతా బెనర్జీ కారుపై రాళ్ల దాడి
- మృతి చెందిన కార్యకర్త కుటుంబాన్ని పరామర్శించేందుకు వెళ్లగా ఘటన
- పోలీసుల సమక్షంలోనే దాడి జరిగిందని మమత ఆరోపణ



**కోల్కతా (ప్రశ్న న్యూస్)** పశ్చిమ బెంగాల్‌లో రాజకీయాలు మరోసారి వేడెక్కాయి. మాజీ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ప్రయాణిస్తున్న కారుపై నిరసనకారులు దాడికి పాల్పడ్డారు. కోల్‌కతా సమీపంలోని ఉత్తర 24 పరగణాల జిల్లా హాలిసహర్‌లో ఈ ఘటన తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. ఆమె కాన్వాయ్‌పై కొందరు రాళ్లు, ఇటుకలు, వాటర్ బాటిళ్లు విసిరారు. పోలీసు కస్టడీలో మరణించినట్లు భావిస్తున్న తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) కార్యకర్త బిర్జు

2లో..

# కామన్వెల్త్ మెడలిస్ట్స్‌తో ప్రధాని భేటీ

## - క్రీడాకారులపై ప్రశంసల వర్షం



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** 2026 గ్లాస్గో కామన్వెల్త్ గేమ్స్ మెడల్ విజేతలతో ప్రధాని నరేంద్ర మోదీ సమావేశమై వారి అద్భుత ప్రదర్శనను అభినందించారు. క్రీడారంగంలో వారి కంట్రిబ్యూషన్‌ను ప్రశంసించారు. ఇండియాకు ఎక్కువ మెడల్స్ తెచ్చిపెట్టే కొన్ని ట్రెడిషనల్ స్పోర్ట్స్ ఈసారి లేకపోయినా, గ్లాస్గో గేమ్స్‌లో ఇండియా నాలుగో స్థానంలో నిలిచి సత్తా చాటింది. బ్రిటన్ లో జరిగిన ఈ ఎడిషన్ లో కొన్ని ఆర్థిక ఇబ్బందుల వల్ల, కొన్ని క్రీడాంశాలను నిర్వహించలేకపోయారు.

2లో..

ప్రజాప్రశ్న

హైదరాబాద్ సోమవారం 10, ఆగష్టు 2026

# కలవరం.. ఎల్ నినో ప్రభావం

### అనుకున్న స్థాయిలో..

ఆంధ్రప్రదేశ్ లో ఇటీవల వానలు కురిసినప్పటికీ అనుకున్న స్థాయిలో పడలేదు. దీంతో గోదావరికి కొంత వరద నీరు చేరినా అవి రైతులకు వ్యవసాయం కోసం చేరే అవకాశాలు కనిపించడం లేదు. గోదావరి, కృష్ణా నదుల్లో ప్రస్తుత్తం ఉన్న నీటి నిల్వలను సాగుకు వదిలే అవకాశం లేదని ఏపీ వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. కేవలం తాగునీరుకు మాత్రమే ప్రాధాన్యం ఇస్తామని, అలాగే పశువులకు అవసరమైన నీటిని అందించాలని ప్రభుత్వం నుంచి సాగునీటి పారుదల శాఖ అధికారులకు ఆదేశాలు అందాయి. ఎల్ నినో ప్రభావంతో రాయలసీమ, ఉత్తరాంధ్రలో కరువు చాయలు ఇప్పటికే అలుముకున్నాయని ప్రభుత్వం చెబుతుంది.

### సాగర్ ఆయకట్టు కింద..

ఇక తెలంగాణలోనూ వానలు ఏపీతో పోల్చుకుంటే కొద్దిగా పరవాలేదు. జూరాల ప్రాజెక్టుకు నీరు చేరింది. గోదావరి నదికి వరద నీరు రావడంతో కొంత ఆయకట్టు కింద ఉన్న రైతులకు సాగు నీరు అందే అవకాశముంది. కాళేశ్వరం, మేడిగడ్డ, శ్రీరామ్ సాగర్ తో పాటు జూరాల ప్రాజెక్టులో నీరు ఉన్నప్పటికీ ఇంకా నీరు సాగుకు విడుదల చేయలేదు. ఇక నాగార్జున సాగర్ కు అయితే నీరు ఇంకా చేరక దాని ఆయకట్టు రైతులు వ్యవసాయపరంగా ఇబ్బందులు పడుతున్నారు. అందుకే ప్రభుత్వం సాగర్ జలాశయం వద్ద ఈ నెల 10న వరుణయాగాన్ని కూడా చేపట్టింది. అంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. వానలు కురుస్తున్నాయే తప్ప అది సాగుకు ఉపయోగం లేని వానలని అధికారులు చెబుతున్నారు. రైతులు మాత్రం కొంత భూగర్భ జలాలు నిండటంతో ఖరీఫ్ సాగును ప్రారంభించారు.

# 'హర్ ఘర్ తిరంగా'లో ఉత్సాహంగా పాల్గొనండి

2022లో ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ కింద ప్రారంభమైన హర్ ఘర్ తిరంగా ప్రచారం ఇప్పుడు కోట్లాది మంది పౌరులు స్వచ్ఛందంగా పాల్గొనే జాతీయ సంప్రదాయంగా మారింది. దీని ద్వారా ప్రజలకు త్రివర్ణ పతాకంతో వ్యక్తిగత అనుబంధాన్ని పెంచడం సహా స్వాతంత్య్ర సమరయోధుల త్యాగాల్ని గుర్తు చేసుకోవడం, దేశభక్తి, జాతీయ ఐక్యతను బలోపేతం చేయడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశాలు. ఈసారి ఆగస్టు 6న హర్ ఘర్ తిరంగా క్యాంపెయిన్‌ను లాంఛ్ చేయగా ఆగస్ట్ 9 నుంచి 17 వరకు దేశవ్యాప్తంగా వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

### సెల్ఫీ విత్ తిరంగా, బైక్ ర్యాలీలు, ప్రత్యేక పోటీలు

ఇక 150 ఏళ్లగా 'వందేమాతరం' దేశ ప్రజల్లో జాతీయ భావాన్ని, స్వాతంత్య్ర స్ఫూర్తిని రగిలిస్తోందని కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వ శాఖ పేర్కొంది. ఈ ఇండిపెండెన్స్ డే సందర్భంగా అదే స్ఫూర్తి ప్రతి వీధిలో, ప్రతి ఇంటిలో ప్రతిధ్వనించేలా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపింది. ఇక్కడ ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేయడంతో పాటు ప్రజలు దేశభక్తి, జాతీయ ఐక్యతను చాటే వివిధ కార్యక్రమాల్లో పాల్గొనేలా ఈసారి క్యాంపెయిన్‌ను రూపొందించారు. దేశవ్యాప్తంగా తిరంగా యాత్రలు, తిరంగా ర్యాలీలు, తిరంగా కచేరీలు, బైక్, సైకిల్ ర్యాలీలు నిర్వహించనున్నారు. కొన్ని ముఖ్యమైన ప్రాంతాల్లో త్రివర్ణ పతాక రంగులతో ప్రత్యేక అలంకరణలు, లైటింగ్ కార్యక్రమాలు, వినూత్న కాన్సర్ట్‌లు, రంగోలి పోటీలు కూడా ఏర్పాటు చేయనున్నారు. పౌరులు తమ ఇళ్లపై జాతీయ జెండాను ఎగురవేసి దానితో సెల్ఫీ తీసుకొని ఆ ఫొటోను హర్ ఘర్ తిరంగా వెబ్‌సైట్‌లో అప్లోడ్ చేయాలని అధికారులు కోరారు.


### దేశవ్యాప్తంగా విస్తృతంగా తిరంగా యాత్రలు

హర్ ఘర్ తిరంగా కార్యక్రమం ఇప్పటికే దేశవ్యాప్తంగా జోరందుకుంది. కేంద్ర హోం మంత్రి అమిత్ షా పుదుచ్చేరిలో ఆదివారం రోజు ఈ హర్ ఘర్ తిరంగా యాత్రలో పాల్గొన్నారు. మురుగా థియేటర్ సిగ్నల్ వద్ద ఈ యాత్రను నిర్వహించగా భారీ సంఖ్యలో జనం భాగస్వాములయ్యారు. తమిళనాడులోని తిరువణ్ణామలై అరుణాచలేశ్వర ఆలయంలో పూజలు నిర్వహించిన అనంతరం ఆయన ఈ యాత్రకు హాజరయ్యారు. ఇక త్రివర్ణ పతాకం దేశ గర్వం, ఐక్యతకు ప్రతీక అన్నారు బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్. ప్రధాని మోదీ నాయకత్వంలో హర్ ఘర్ తిరంగా కార్యక్రమం ప్రతి ఒక్కరిలో దేశభక్తి స్ఫూర్తిని మరింత పెంచుతోందని పేర్కొన్నారు. ప్రజలు ప్రతి ఇంట్లో, ప్రతి ఒక్కరి హృదయంలో త్రివర్ణ పతాకాన్ని భాగం చేయాలని కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు కోరారు. ఇక హర్ ఘర్ తిరంగా 2026ను దేశవ్యాప్తంగా దేశభక్తి పండగగా జరుపుకోవాలని మంత్రి పీయూష్ గోయల్ పిలుపునిచ్చారు.

### 'డూ ఆర్ డై' పిలుపు స్వాతంత్య్ర పోరాటానికి కొత్త ఊపు

ఇంకా అండమాన్ నికోబార్ దీవుల నుంచి మణిపూర్, ఉత్తరాఖండ్, జమ్మూకశ్మీర్, సిక్కిం వంటి పలు ప్రాంతాల్లో ఆదివారం తిరంగా యాత్రలు, ఇతర కార్యక్రమాలు నిర్వహించారు. అండమాన్ రాజధాని శ్రీ విజయపురంలో భారత ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ 'హర్ ఘర్ తిరంగా' ప్రచారం ప్రారంభించారు. ఆగస్టు క్రాంతి దివస్ సందర్భంగా ఫ్లాగ్ పాయింట్ వద్ద జాతీయ జెండాను ఎగురవేశారు. 1942 ఆగస్ట్ 8న మహాత్మా గాంధీ ఇచ్చిన 'డూ ఆర్ డై' పిలుపు దేశవ్యాప్తంగా స్వాతంత్య్ర పోరాటానికి కొత్త ఊపునిచ్చిందని ఉపరాష్ట్రపతి గుర్తుచేశారు. భారత్ ఎప్పుడూ శాంతిని కోరుకుంటుందని దేశ ప్రయోజనాలు, సార్వభౌమత్వాన్ని కాపాడుకునేందుకు భారత్ ఎప్పుడూ సిద్ధంగా ఉంటుందని పేర్కొన్నారు. ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి డెహ్రాడూన్‌లోని గాంధీ పార్క్‌లో నిర్వహించిన యాత్రలో పాల్గొన్నారు. అక్కడి నుంచి క్లాక్ టవర్ వరకు వేలాది మందితో కలిసి తిరంగా యాత్ర నిర్వహించారు. జమ్మూకశ్మీర్ పుల్వామా జిల్లాలో కూడా నిర్వహించిన భారీ తిరంగా ర్యాలీలో వందలాదిగా విద్యార్థులు, ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు. మణిపూర్ ఇంఫాల్‌లో నిర్వహించిన హర్ ఘర్ తిరంగా యాత్రలో సీఎం ఖేమ్‌చంద్ సింగ్, సిక్కిం గ్యాంగ్‌టక్‌లో రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు డీఆర్ థాపా తిరంగా యాత్ర నిర్వహించారు. మొత్తంగా హర్ ఘర్ తిరంగా కార్యక్రమం, దేశవ్యాప్తంగా జాతీయ ఐక్యత, దేశభక్తి సందేశాన్ని విస్తృతంగా చాటుతోంది.

# పెద్ది కుటుంబానికి కేసీఆర్ పరామర్శ



తీవ్ర విషాదంలో ఉన్న కుటుంబ సభ్యులను కేసీఆర్ ఓదార్చారు. ఆ కుటుంబం కష్ట సమయంలో పార్టీ అండగా ఉంటుందని ఎలాంటి అవసరం వచ్చినా బీఆర్ఎస్ పార్టీ సహకరిస్తుందని కేసీఆర్ భరోసా ఇచ్చారు. పిల్లల భవిష్యత్తు, చదువులు, కుటుంబ సంక్షేమంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామని హామీ ఇచ్చారు. పెద్ది సుదర్శన్‌రెడ్డి కుటుంబానికి బీఆర్ఎస్ పార్టీ తరపున రూ.2.25 కోట్ల ఆర్థిక సాయం అందించనున్నట్లు ఇప్పటికే ప్రకటించింది. ఈ మేరకు కేసీఆర్ కుటుంబ సభ్యులకు రూ.2.25 కోట్ల చెక్కును అందజేశారు. ఇందులో పెద్ది సుదర్శన్‌రెడ్డి ఇద్దరు పిల్లలకు చెరో రూ.కోటి చొప్పున ఇవ్వనున్నారు. అదేవిధంగా పెద్ది సుదర్శన్‌రెడ్డి తల్లి అమృతమ్మ సంక్షేమం కోసం రూ.25 లక్షలను బ్యాంకులో జమ చేయాలని బీఆర్ఎస్ నేతలు నిర్ణయించారు. కుటుంబానికి భవిష్యత్తులోనూ పార్టీ అండగా ఉంటుందని బీఆర్ఎస్ నాయకత్వం స్పష్టం చేసింది. పిల్లల చదువులు, వారి భవిష్యత్తు, కుటుంబ అవసరాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తామని హామీ ఇచ్చింది. ఇక కేసీఆర్ నల్లబెల్లి పర్యటన విషయం తెలియడంతో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీ సంఖ్యలో అక్కడికి చేరుకున్నారు. పెద్ది సుదర్శన్‌రెడ్డి నివాసం వద్ద కార్యకర్తలు భారీగా గుమిగూడటంతో కొంతసేపు రద్దీ, స్వల్ప తోపులాట చోటుచేసుకుంది. దీంతో పోలీసులు రంగంలోకి దిగి కేసీఆర్ కాన్వాయ్‌ను సురక్షితంగా నివాసం లోపలికి తీసుకెళ్లారు. కేసీఆర్ రాకతో నల్లబెల్లిలో తీవ్ర భావోద్వేగ వాతావరణం నెలకొంది. పెద్ది సుదర్శన్‌రెడ్డి పార్టీకి, తెలంగాణ ఉద్యమానికి అందించిన సేవలను బీఆర్ఎస్ నేతలు ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. పెద్ది సుదర్శన్‌రెడ్డి బీఆర్ఎస్ పార్టీలో మొదటి నుంచి పనిచేశారు. నర్సంపేట నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహించారు. తెలంగాణ ఉద్యమంలోనూ ఆయన కీలకంగా పనిచేశారు. పెద్ది సుదర్శన్ రెడ్డి అకాల మరణం పార్టీ శ్రేణులకు తీరని లోటు అని నేతలు పేర్కొన్నారు. పెద్ది సుదర్శన్ రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించిన అనంతరం కేసీఆర్, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలకు అభివాదం చేశారు. అనంతరం నల్లబెల్లి నుంచి సిద్దిపేట జిల్లా ఎర్రవల్లిలోని తన ఫాంహౌస్‌కు వెళ్లిపోయారు. ఇక అంతకుముందు కేసీఆర్ రాక సందర్భంగా మార్గమధ్యంలో ఆయనను చూసేందుకు భారీగా అభిమానులు, బీఆర్ఎస్ కార్యకర్తలు రోడ్లపైకి చేరుకున్నారు. కొన్ని చోట్ల కేసీఆర్ తన కాన్వాయ్ ఆపి వారితో ముచ్చటించారు.

# నల్సార్ స్నాతకోత్సవానికి సీజేఐ వద్దు

తీవ్ర చర్చనీయాంశంగా మారింది. వివరాల్లోకి వెళితే, 2026 బ్యాచ్ స్నాతకోత్సవానికి సీజేఐ జస్టిస్ సూర్యకాంత్‌ను ముఖ్య అతిథిగా ఆహ్వానించే ప్రతిపాదనను విద్యార్థులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఢిల్లీలో జరిగిన నీట్ నిరసనలపై సుప్రీంకోర్టులో జూలై 22న జరిగిన విచారణ సందర్భంగా సీజేఐ నేతృత్వంలోని ధర్మాసనం చేసిన వ్యాఖ్యలే ఈ నిరసనకు ప్రధాన కారణం. ఆ రోజు విచారణ సందర్భంగా, నిరసనకారులపై పోలీసుల చర్యకు సంబంధించిన వీడియోలపై సుమోటో విచారణ చేపట్టడానికి ధర్మాసనం నిరాకరించింది. ఈ క్రమంలో సీజేఐ, "వీడియోలు చూసే ఆసక్తి మాకు లేదు," "మా సమయాన్ని, మీ సమయాన్ని వృథా చేయకండి" వంటి వ్యాఖ్యలు చేశారని విద్యార్థులు తమ లేఖలో పేర్కొన్నారు. సీజేఐ వ్యాఖ్యలు అసంబద్ధంగా, బాధ్యతారహితంగా ఉన్నాయని, అందుకే ఆయనను స్నాతకోత్సవానికి పిలవరాదని వారు డిమాండ్ చేస్తున్నారు. తమ డిమాండ్‌కు మద్దతుగా విద్యార్థులు ఇప్పటికే ఒక పూట భోజనం చేయకుండా నిరసన తెలిపారు. తమ అభ్యర్థనను యాజమాన్యం పట్టించుకోకపోతే, వారం రోజుల నోటీసు ఇచ్చి ఆందోళనలు మరింత ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు. అయితే, నల్సార్ యాజమాన్యం స్నాతకోత్సవం తేదీని గానీ, ముఖ్య అతిథిని గానీ అధికారికంగా ఇంకా ప్రకటించలేదు. కానీ, ప్రతి ఏటా సీజేఐని స్నాతకోత్సవానికి ఆహ్వానించడం నల్సార్‌లో ఒక సంప్రదాయంగా వస్తోంది. కాగా, సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ విద్యార్థుల నిరసనను ఎదుర్కోవడం ఇది రెండోసారి. ఈ నెల మొదట్లో ముంబైలోని టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్ లో జరగాల్సిన 86వ స్నాతకోత్సవానికి కూడా ఆయనే ముఖ్య అతిథిగా హాజరు కావాల్సి ఉంది. అయితే, ఎస్ఎఫ్ఐ అనుబంధ విద్యార్థులు నిరసన తెలిపే అవకాశం ఉందన్న ఇంటెలిజెన్స్ సమాచారంతో ఆ కార్యక్రమాన్ని చివరి నిమిషంలో వాయిదా వేశారు. ఇప్పుడు టిస్ తర్వాత నల్సార్‌లోనూ అదే పరిస్థితి పునరావృతం కావడం గమనార్హం. విద్యార్థుల లేఖతో నల్సార్ యాజమాన్యం ఇప్పుడు ఇరకాటంలో పడింది.

# జాతీయ జెండాతో పాటు మీ అజెండా ఉండాలి

దినోత్సవం సందర్భంగా విజయవాడ అంబేద్కర్ కళావేదికలో జరిగిన సభకు చంద్రబాబు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ... గిరిజన సమాజానికి సమగ్ర అభివృద్ధి, సంక్షేమంపై పలు కీలక హామీలు ఇస్తూ, వారి హక్కులను కాపాడేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని భరోసా ఇచ్చారు.

### ప్రతి వ్యక్తి ఒక శక్తి.. ద్రౌపది ముర్ము ఆదర్శం

సాధారణ ఆదివాసీ కుటుంబంలో పుట్టి, అనేక కష్టాలను అధిగమించి, దేశ ప్రథమ పౌరురాలిగా అత్యున్నత శిఖరాలను అధిరోహించిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శమని చంద్రబాబు అన్నారు. ఆమె స్ఫూర్తితో గిరిజన యువత ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకోవాలని సూచించారు. జాతీయ జెండాతో పాటు మీ అజెండా కూడా ఉండాలని పిలుపునిచ్చారు. "సంకల్పం బలంగా ఉంటే ఏదైనా సాధించవచ్చు. ద్రౌపది ముర్ము, అబ్దుల్ కలాం, బీఆర్ అంబేద్కర్, ఎన్టీఆర్, నరేంద్ర మోదీ వంటి మహనీయులంతా సాధారణ కుటుంబాల నుంచి వచ్చినవారే. 'నేను ఏంటి? ఎలా ఎదగాలి? ఈ సమాజానికి, దేశానికి నేనేం ఇవ్వాలి?' అనే లక్ష్యంతో పనిచేయాలి. మీ విజయం దేశ విజయమవుతుంది" అని ఆయన పేర్కొన్నారు. ఈ స్ఫూర్తిని వ్యాపింపజేసేందుకు ఆగస్టు 9 నుంచి 15 వరకు 'అనే నేను' పేరుతో ఒక ఉద్యమంలా ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.

### గిరిజన ఉత్పత్తులకు గ్లోబల్ బ్రాండింగ్.. అరకు కాఫీ ఒక సక్సెస్ స్టోరీ

గిరిజన ప్రాంతాల్లోని ఆర్థిక స్వావలంబనపై చంద్రబాబు ప్రత్యేకంగా దృష్టి సారించారు. తాను 25 ఏళ్ల క్రితం ఒక చిరు ప్రయత్నంగా ప్రారంభించిన అరకు కాఫీ, నేడు ప్రపంచవ్యాప్తంగా ప్రఖ్యాతి గాంచడాన్ని ఆయన గుర్తుచేశారు. "అరకు కాఫీకి నేనే పేరు పెట్టాను. దానిని మార్కెటింగ్ చేసి, ప్రధాని నరేంద్ర మోడీ నుంచి ఆస్ట్రేలియా ప్రధాని వరకు బహూకరించి, గ్లోబల్ బ్రాండ్‌గా నిలబెట్టాను. పారిస్‌లో కూడా అరకు కాఫీ స్టాళ్లు ఉన్నాయి" అని గర్వంగా ప్రకటించారు. ఇదే స్ఫూర్తితో సీతంపేట పసుపు, రంపచోడవరం రబ్బర్, పార్వతీపురం పైనాపిల్, తేనె, తాటిబెల్లం వంటి స్థానిక ఉత్పత్తులకు విలువ జోడించి, బ్రాండింగ్ చేసి, మార్కెటింగ్ చేసే బాధ్యతను ప్రభుత్వమే తీసుకుంటుందని హామీ ఇచ్చారు. గిరిజన ప్రాంతాల్లోని రైతులు పండించే ప్రతి పంటకు గిట్టుబాటు ధర కల్పించి, వారిని ఆర్థికంగా బలోపేతం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా వివిధ సంస్థలతో 19 అవగాహన ఒప్పందాలు (ఎంఓయూ) కుదుర్చుకున్నట్లు వెల్లడించారు.

### మౌలిక వసతులు, విద్య, వైద్యానికి పెద్దపీట

గిరిజన ప్రాంతాల సమగ్రాభివృద్ధికి నాలుగు కీలక రంగాలపై దృష్టి పెడుతున్నట్లు ముఖ్యమంత్రి ప్రకటించారు. మౌలిక సదుపాయాలు, విద్య, వైద్యం, ఆదాయ మార్గాల పెంపునకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. మౌలిక వసతులు: డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆధ్వర్యంలో 2,336 గిరిజన ఆవాసాలకు మిషన్ మోడ్‌లో రోడ్ కనెక్టివిటీ కల్పిస్తామన్నారు. 'జల్ జీవన్ మిషన్' కింద 2027 డిసెంబర్ నాటికి ప్రతి గిరిజన ఇంటికి కుళాయి ద్వారా సురక్షిత నీటిని అందిస్తామని హామీ ఇచ్చారు. మారుమూల గ్రామాలకు సైతం టెలికాం కనెక్టివిటీ అందించి, డోలీ మోతలు లేని సమాజాన్ని నిర్మిస్తామన్నారు.

విద్య: 'తల్లికి వందనం' కింద 4.92 లక్షల మంది గిరిజన విద్యార్థులకు రూ.650 కోట్లు అందించామని, ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యకు పెద్దపీట వేస్తున్నామని తెలిపారు. విశాఖలోని మేకవారిపాలెంలో 600 మంది విద్యార్థులతో 'సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్' ఏర్పాటు చేసి, ఐఐటీ వంటి జాతీయ పరీక్షలకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. ఏటా కనీసం 100 మంది గిరిజన విద్యార్థులు జాతీయ స్థాయి సంస్థల్లో సీట్లు సాధించడమే లక్ష్యమన్నారు. వైద్యం: పాడేరులో మెడికల్ కాలేజీతో పాటు పార్వతీపురం, రంపచోడవరం, శ్రీశైలం వంటి ప్రాంతాల్లో మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రులు నిర్మిస్తామన్నారు. 'సంజీవిని' ప్రాజెక్ట్ ద్వారా ప్రతి ఒక్కరి ఆరోగ్య వివరాలను డిజిటలైజ్ చేస్తామని, సికిల్ సెల్ అనీమియా బాధితులకు రూ.10,000 పింఛను అందిస్తూ, వ్యాధి నిర్మూలనకు కృషి చేస్తామని ప్రకటించారు.

### జీవో నెంబర్ 3 పరిరక్షణకు కట్టుబడి ఉన్నాం

గిరిజన ప్రాంతాల్లో ఉద్యోగాలు స్థానికులకే దక్కాలనే ఆశయంతో ఎన్టీఆర్ హయాంలో పురుడుపోసుకుని, తాను 2000 సంవత్సరంలో తీసుకొచ్చిన జీవో నెంబర్ 3ను కాపాడతామని చంద్రబాబు స్పష్టమైన హామీ ఇచ్చారు. సుప్రీంకోర్టులో ఈ జీవోను కొట్టివేయడానికి గత ప్రభుత్వ వైఫల్యమే కారణమని విమర్శించారు. "ఈ జీవోను చట్టపరంగా, రాజ్యాంగబద్ధంగా నిలబడేలా పటిష్టమైన కార్యాచరణ రూపొందిస్తాం.

ఆదివాసుల హక్కుల పరిరక్షణకు ఈ ప్రభుత్వం కట్టుబడి ఉంది. ఆవేశంతో కాకుండా ఆలోచనతో, అందరి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని దీనిపై ముందుకు వెళతాం" అని భరోసా ఇచ్చారు. గిరిజన ప్రాంతాలను కేవలం వెనుకబడిన ప్రాంతాలుగా కాకుండా, అపార అవకాశాలున్న ప్రాంతాలుగా చూస్తున్నామని, అక్కడి పచ్చదనం, స్వచ్ఛమైన వాతావరణాన్ని ఉపయోగించుకుని టూరిజం హబ్‌లుగా తీర్చిదిద్దుతామని అన్నారు. ప్రతి గిరిజన ఇల్లు 'అతిథి గృహం'గా మారాలని, తద్వారా ప్రపంచానికి ఆతిథ్యం ఇవ్వాలని ఆకాంక్షించారు. ప్రతి ఒక్కరూ ఒక చెట్టు నాటి, దానిని సంరక్షించడం ద్వారా పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. 2047 నాటికి 'వికసిత్ భారత్', 'స్వర్ణాంధ్రప్రదేశ్' లక్ష్యాలను సాధించడంలో ఆదివాసీలు కీలక పాత్ర పోషించాలని, వారి సర్వతోముఖాభివృద్ధికి ప్రభుత్వం అండగా ఉంటుందని ముఖ్యమంత్రి చంద్రబాబు పునరుద్ఘాటించారు.

# కామన్వెల్త్ మెడలిస్ట్స్‌తో ప్రధాని భేటీ

### యంగ్ అథ్లెట్లకు మోదీ సందేశం.. స్పోర్ట్స్ కల్చర్ ప్రమోషన్

అథ్లెట్లతో ముఖాముఖి సందర్భంగా దేశవ్యాప్తంగా స్పోర్ట్స్ పార్టిసిపేషన్‌ను ప్రోత్సహించడం చాలా ముఖ్యామని ప్రధాని నరేంద్ర మోడీ నొక్కి చెప్పారు. వివిధ క్రీడాంశాలకు చెందిన ప్లేయర్లకు కంటిన్యూయస్ సపోర్ట్ అందించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. మరింత మంది యూత్ క్రీడల్లోకి వచ్చేలా మంచి వాతావరణాన్ని క్రియేట్ చేయాలని పిలుపునిచ్చారు. ఈ మీటింగ్ ద్వారా విజేతలు తమ అనుభవాలను ప్రధానితో పంచుకున్నారు.

### గోల్డ్ మెడలిస్ట్ సాక్షి చౌదరి హ్యాపీనెస్.. పిఎమ్ మోడీ హంబుల్ నేచర్

గోల్డ్ మెడల్ సాధించిన బాక్సర్ సాక్షి చౌదరి ఈ మీటింగ్ పై రియాక్ట్ అవుతూ, "ప్రధాని నరేంద్ర మోడీ మమ్మల్ని ఇన్వైట్ చేయడం గర్వంగా ఉంది. ఆయన చాలా హంబుల్ గా మాట్లాడారు. ఈ మీటింగ్ మాకు ఎప్పటికీ గుర్తుండిపోతుంది" అని చెప్పింది. సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన వీడియోలో మోడీ "ఆడేవాళ్లే మెరుస్తారు, ఎప్పుడూ భారత్‌కు మద్దతుగా నిలవండి, భారత్ మాతాకీ జై" అని మెసేజ్ ఇచ్చారు.

### ఇతర క్రీడల్లో కొత్త వెలుగులు.. భవిష్యత్ టార్గెట్లు

కీలకమైన కొన్ని క్రీడలు లేకపోయినా ఇండియా 4వ స్థానంలో నిలవడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఇది ఇతర క్రీడల అథ్లెట్లు ముందుకు వచ్చి తమ టాలెంట్ నిరూపించుకోవడానికి హెల్ప్ అయింది. రాబోయే రోజుల్లో ఇండియా తన స్పోర్ట్స్ బేస్‌ను విస్తరించడానికి, అన్ని రకాల క్రీడల్లో డెప్త్ పెంచుకోవడానికి గ్లాస్గో పర్ఫార్మన్స్ చాలా ఉపయోగపడుతుందని పీఎంఓ ప్రతినిధి వెల్లడించారు.

# పాతబస్తీ బరాబర్ హిందువులదే

బండి సంజయ్ ఆరోపించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ ప్రభుత్వాలు హిందూ సమాజం, ఆలయాల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని ఆయన విమర్శించారు. అయితే ఇవన్నీ తన రాజకీయ విమర్శలేనని హిందూ సమాజానికి సంబంధించిన అంశాలపై మాట్లాడటం తన బాధ్యతగా భావిస్తున్నానని పేర్కొన్నారు. సనాతన ధర్మ పరిరక్షణకు యువత ముందుకు రావాలని బండి సంజయ్ పిలుపునిచ్చారు. ముఖ్యంగా జెన్‌జీ తరం ఆధ్యాత్మిక, సామాజిక అంశాలపై అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందని బండి సంజయ్ పేర్కొన్నారు. ఆలయాల పరిరక్షణ, గోరక్షణ, హిందువుల భద్రత వంటి అంశాలపై తాను నిరంతరం మాట్లాడుతానని స్పష్టం చేశారు. చరిత్రను వాస్తవ కోణంలో భావితరాలకు అందించాల్సిన అవసరం ఉందని కూడా తెలిపారు. తెలంగాణ సాయుధ పోరాట యోధుల చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చడంపై ప్రశ్నలు సంధించారు. టిప్పుసుల్తాన్, అయోధ్య రామమందిరం వంటి అంశాలను ప్రస్తావిస్తూ కాంగ్రెస్ వైఖరిని విమర్శించారు. రాష్ట్రంలో నిరుద్యోగ సమస్యపై కూడా బండి సంజయ్ రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని నిలదీశారు. హైడ్రాలో పరిమిత సంఖ్యలో ఉద్యోగాల భర్తీకి నిర్వహించిన ఫిజికల్ టెస్ట్‌కు పెద్ద సంఖ్యలో యువత హాజరైన విషయాన్ని ప్రస్తావించారు. కాంగ్రెస్ ఎన్నికల సమయంలో ఇచ్చిన ఉద్యోగ హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగులకు నెలకు రూ.4 వేల భృతి ఇస్తామని ఇచ్చిన హామీని కూడా అమలు చేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం రోజ్‌గార్ మేళాల ద్వారా ఉద్యోగ నియామకాలు చేపడుతోందని పేర్కొన్నారు. బోనాల ఉత్సవాలకు రాజకీయాలకు సంబంధం లేదని తాను ప్రతి ఏడాది ఈ ఉత్సవాల్లో పాల్గొంటున్నానని బండి సంజయ్ తెలిపారు. ప్రజా సమస్యలపై బీజేపీ నిరంతరం పోరాడుతుందని పేర్కొన్నారు. తెలంగాణలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడితే ఆలయాల అభివృద్ధి, బోనాల నిర్వహణ, ప్రజా సంక్షేమం వంటి అంశాలకు ప్రాధాన్యం ఇస్తామని ఆయన స్పష్టం చేశారు.

# మృత్యువుతో పోరాడి ఓడిన మెడికో ప్రియాంక

కోల్పోవడం బాధాకరమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. బాధిత కుటుంబానికి రూ.20 లక్షల ఆర్థిక సాయం అందించాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు. అదే విధంగా బాధిత కుటుంబానికి ఇతరత్రా అన్ని విధాలుగా మద్దతుగా ఉంటామని ఆయన తెలిపారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ప్రియాంక ప్రాణాలు కోల్పోయిన ఘటనపై జిల్లా అధికారులతో గతంలోనే ఓసారి జిల్లా అధికారులతో సమీక్షించిన ముఖ్యమంత్రి చంద్రబాబు, ఆదివారం నిర్వహించిన టెలీకాన్ఫరెన్స్ లో మరోసారి మాట్లాడారు. ప్రియాంక మృతికి కారణమైన నిందితులు ఇప్పటికే అరెస్టై జైల్లో ఉన్నారని తూర్పు గోదావరి జిల్లా ఎస్పీ వివరించగా నిర్లక్ష్యంతో నిండు ప్రాణం తీసిన వారిపై కఠిన సెక్షన్లతో శిక్షలు పడేలా చూడాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. ప్రియాంకకు ప్రమాదం జరిగిన అనంతరం రాజమండ్రిలో చికిత్స అందించడం, తరువాత కుటుంబ సభ్యులు ఆమెను మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తరలించిన విషయాన్ని అధికారులు వివరించారు. తీవ్ర గాయాలతో గురువారం నాడు సికింద్రాబాద్ లోని కిమ్స్ హాస్పిటల్ లో చేర్పించిన ప్రియాంకకు వెంటిలేటర్ మీద చికిత్స అందించారు. పరిస్థితి విషమించడంతో ఆదివారం మధ్యాహ్నం 3.32 గంటలకు ఆమె చనిపోయారని హాస్పిటల్ ఓ ప్రకటన విడుదల చేసింది.

### పీజీ వైద్య విద్యార్థిని ప్రియాంక మరణం బాధించింది: పవన్ కళ్యాణ్

రాజమహేంద్రవరంలో యువకులు కారును నిర్లక్ష్యంగా నడిపి ఢీకొట్టిన ఘటనలో తీవ్రంగా గాయపడిన పీజీ వైద్య విద్యార్థిని ప్రియాంక మృతి ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌ను కలచివేసింది. భవిష్యత్తులో వైద్యురాలిగా ఎంతో మందికి సేవలు అందించాల్సిన ఆమె ఇలా అర్థాంతరంగా కన్నుమూయడం బాధాకరం అన్నారు. నిర్లక్ష్యంగా కారు నడిపి ఒక నిండు ప్రాణాన్ని బలిగొన్న నిందితులకు కఠిన శిక్షలు పడేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. డా.ప్రియాంక ఆత్మకు శాంతి చేకూరాలని ఆ భగవంతుడిని ప్రార్థించిన ఆయన, ఆమె కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

### నా వ్యాఖ్యలను కొన్ని ఛానెళ్లు వక్రీకరించాయి: ప్రియాంక తండ్రి వెంకటేష్ ఆవేదన

రాజమహేంద్రవరంలో రోడ్డు ప్రమాదానికి గురై చికిత్స పొందుతూ చనిపోయిన మెడికో ప్రియాంక తండ్రి వెంకటేష్ మీడియా తీరుపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. తాను చేసిన వ్యాఖ్యలను కొన్ని టీవీ ఛానెళ్లు పూర్తిగా వక్రీకరించాయని, ఇప్పటికే తీవ్ర దుఃఖంలో ఉన్న తమను తప్పుడు వార్తలతో మరింత బాధపెట్టవద్దని కోరారు. తాను ప్రభుత్వాన్ని గానీ, పోలీసు వ్యవస్థను గానీ ఎక్కడా తప్పుపట్టలేదని ఆయన స్పష్టం చేశారు. నిందితులకు కఠిన శిక్ష పడేలా పోలీసులు సరైన సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారని వెల్లడించారు. ప్రభుత్వంపై బురద జల్లడమే లక్ష్యంగా కొన్ని మీడియా సంస్థలు బాధితుల మనోభావాలను తీవ్రంగా దెబ్బతీసేలా తప్పుడు కథనాలను ప్రసారం చేస్తున్నాయని మండిపడ్డారు. ప్రియాంక తండ్రి వెంకటేష్ మాట్లాడుతూ ఈ కేసుకు సంబంధించి పోలీసులు జరుపుతున్న దర్యాప్తు తీరు సంతృప్తిగా ఉందన్నారు. తమకున్న అన్ని సందేహాలను అధికారులు నివృత్తి చేశారని, దర్యాప్తు పురోగతితో పాటు నిందితులపై మోపిన కఠినమైన సెక్షన్ల వివరాలను తమకు వివరించారని చెప్పారు. నిందితులకు తగిన రీతిలో శిక్ష పడేలా ప్రభుత్వం, పోలీసులు బాధ్యతాయుతంగా చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. ఈ దారుణ ఘటనపై సీఎం నారా చంద్రబాబు నాయుడు, హోంమంత్రి వంగలపూడి అనితతో పాటు పోలీస్ యంత్రాంగం స్పందించిన తీరు తమకు పూర్తి నమ్మకాన్ని కలిగించిందన్నారు. తమ మనస్సులో లేని మాటలను, తాము అనని విషయాలను కొందరు కావాలనే ప్రసారం చేస్తూ తమను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన చెందారు. కొన్ని మీడియా ఛానెళ్లు ఇప్పటికైనా బాధ్యతాయుతంగా వ్యవహరించి, తాము అసలు ఏం చెప్పామో దాన్నే ప్రసారం చేయాలని కోరారు.

# హైదరాబాద్‌లో ట్రాఫిక్ రద్దీకి చెక్

ఇతర ప్రభుత్వ విభాగాలతో సమన్వయంతో ఈ ప్రణాళికను అమలు చేయనుంది. తొలి దశలో కేబీఆర్ పార్కు, జీవీకే, నానల్‌నగర్ కారిడార్, సికింద్రాబాద్ ప్రాంతాల్లో ట్రాఫిక్ సిమ్యులేషన్ అధ్యయనం నిర్వహించనున్నారు. నగరంలోని కీలక జంక్షన్లు, రద్దీ కారిడార్లలో ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించకపోవడంతో ఈ విధానంపై అధికారులు దృష్టి సారించారు. ఇప్పటివరకు వాహనాల రద్దీని అంచనా వేయకుండా ఫ్లైఓవర్లు, రహదారి విస్తరణలు, సిగ్నల్ మార్పులు చేపట్టడం వల్ల కొన్ని ప్రాంతాల్లో సమస్య పరిష్కారం కాకపోగా అనుసంధాన మార్గాల్లో మరింత రద్దీ పెరిగిన సందర్భాలు ఉన్నాయి. ట్రాఫిక్ సిమ్యులేషన్ అనేది కంప్యూటర్ సాఫ్ట్‌వేర్ ఆధారంగా రహదారులు, జంక్షన్లు, వాహనాల రాకపోకలను వర్చువల్‌గా రూపొందించి విశ్లేషించే అధునాతన పద్ధతి. కొత్త ఫ్లైఓవర్ నిర్మాణం, రోడ్డు విస్తరణ, సిగ్నల్ వ్యవస్థలో మార్పులు చేస్తే వాటి ప్రభావం ఎలా ఉంటుందో పనులు ప్రారంభించకముందే అంచనా వేయవచ్చు. విదేశాల్లో విస్తృతంగా వినియోగిస్తున్న ఈ సాంకేతికతను హైదరాబాద్‌లోనూ అమలు చేయడం ద్వారా ట్రాఫిక్ ప్రణాళికల్లో మరింత కచ్చితత్వం సాధించవచ్చని అధికారులు భావిస్తున్నారు. అధ్యయనంలో భాగంగా తొలుత సంబంధిత ప్రాంతానికి సంబంధించిన వాస్తవ సమాచారాన్ని సేకరిస్తారు. రహదారి వెడల్పు, గంటకు ప్రయాణించే వాహనాల సంఖ్య, వాహనాల వేగం, జంక్షన్ల వద్ద సిగ్నల్ టైమింగ్స్, లేన్‌ల సంఖ్య తదితర వివరాలను కంప్యూటర్ మోడల్‌లో నమోదు చేస్తారు. అనంతరం మైక్రోస్కోపిక్, మెసోస్కోపిక్, మాక్రోస్కోపిక్ పద్ధతుల్లో ట్రాఫిక్ ప్రవాహాన్ని విశ్లేషిస్తారు. మైక్రోస్కోపిక్ విశ్లేషణలో ఒక్కో వాహనం వేగం, లేన్ మార్పులు, ముందు వాహనంతో ఉండే దూరం వంటి అంశాలను పరిశీలిస్తారు. మెసోస్కోపిక్ విధానంలో వాహనాల సమూహాల కదలికలను అధ్యయనం చేస్తారు. మాక్రోస్కోపిక్ విశ్లేషణ ద్వారా పెద్ద రహదారి నెట్‌వర్క్ లేదా నగరంలోని మొత్తం ట్రాఫిక్ సాంద్రత, సగటు వేగం వంటి అంశాలను అంచనా వేస్తారు. కొత్తగా ఫ్లైఓవర్ నిర్మిస్తే రద్దీ నిజంగా తగ్గుతుందా? లేక సమీపంలోని మరో జంక్షన్ వద్ద ట్రాఫిక్ జామ్ పెరుగుతుందా? అనే విషయాన్ని వర్చువల్ అధ్యయనం ద్వారా ముందుగానే తెలుసుకోవచ్చు. జంక్షన్ల వద్ద వాహన ప్రవాహానికి అనుగుణంగా సిగ్నల్ టైమింగ్స్‌ను పెంచడం లేదా తగ్గించడం కూడా ఈ మోడల్ ద్వారా అంచనా వేయవచ్చు. అలాగే ప్రమాదకర ప్రాంతాలను గుర్తించి రోడ్డు డిజైన్‌లో మార్పులు చేయడానికి అవకాశం ఉంటుంది. జంక్షన్ల వద్ద వాహనాలు ఎక్కువసేపు నిలిచే సమయాన్ని తగ్గించడం ద్వారా ఇంధన వృథా, వాహనాల నుంచి వెలువడే కాలుష్యాన్ని కూడా నియంత్రించవచ్చు. మొత్తంగా హైదరాబాద్ ట్రాఫిక్ వ్యవస్థను డేటా ఆధారంగా ప్రణాళిక చేసేందుకు ఈ అధ్యయనం కీలకంగా మారే అవకాశం ఉంది.

# నాపై జరిగిన దాడిలో చనిపోయి ఉండేదాన్ని

కియోట్ కుటుంబాన్ని పరామర్శించేందుకు మమతా బెనర్జీ వెళుతుండగా ఈ సంఘటన చోటుచేసుకుంది. దోపిడీ ఆరోపణలపై అరెస్టయిన బిర్జూ, పోలీసుల కస్టడీలో మరణించాడు. ఈ నేపథ్యంలో, మమత పర్యటనను వ్యతిరేకిస్తూ స్థానికులు పెద్ద ఎత్తున నిరసనకు దిగారు. ఆమె కారును చుట్టుముట్టి, దానిపై బురద పూశారు. "చోర్ భగావో" (దొంగను తరిమేయండి) అంటూ నినాదాలు చేశారు. ఈ దాడిపై మమతా బెనర్జీ తీవ్రంగా స్పందించారు. పోలీసుల సమక్షంలోనే గుర్తుతెలియని వ్యక్తులు తన వాహనంపై రాళ్లతో దాడి చేశారని ఆమె ఆరోపించారు. "కారు అద్దాలు మూసి ఉండటంతో ప్రాణాలతో బయటపడ్డాను. లేదంటే ఆ రాళ్లు తలకు తగిలి నా తల పగిలిపోయేది" అని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులు ప్రేక్షకపాత్ర వహించారని, వారు కేవలం అధికార బీజేపీకి మాత్రమే రక్షణ కల్పిస్తున్నారని మండిపడ్డారు. ఆమెతో పాటు ఉన్న లోక్‌సభ ఎంపీ కల్యాణ్ బెనర్జీ, రాజ్యసభ ఎంపీ డోలా సేన్ కూడా అధికారుల వైఫల్యాన్ని విమర్శించారు. ఈ ఘటనను రాష్ట్ర బీజేపీ చీఫ్ సమీక్ భట్టాచార్య ఖండించారు. ఈ దాడితో తమ పార్టీకి ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన పోలీసులను డిమాండ్ చేశారు. అయితే, సీఎం సువేందు అధికారి దీన్ని మమత సృష్టించిన డ్రామాగా అభివర్ణించారు. కస్టడీ మరణాన్ని రాజకీయం చేసేందుకే మమత బలవంతంగా ఆ ప్రాంతానికి వెళ్లారని ఆరోపించారు. మృతుడి కుటుంబ సభ్యులు అధికారుల తీరుపై సంతృప్తి చెందారని, మరణానికి కచ్చితమైన కారణం తెలియాలని మాత్రమే వారు కోరుకుంటున్నారని తెలిపారు. తన పర్యటనతో మమత ప్రజా జీవితానికి ఆటంకం కలిగించారని విమర్శించారు.

## ఘనంగా యువజన కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవం

**యువత హక్కులు, ప్రజల కోసం,**

**రాజ్యాంగ పరిరక్షణకు పోరాడుతాం: శివంత్ రెడ్డి**



మహబూబ్‌నగర్(ప్రశ్న న్యూస్) యువజన కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని మహబూబ్‌నగర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మహబూబ్‌నగర్ జిల్లా ఇన్‌చార్జ్ శివంత్ రెడ్డి ఆధ్వర్యంలో యువజన కాంగ్రెస్ జెండాను ఆవిష్కరించారు. అనంతరం నాయకులు, కార్యకర్తలకు ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

### యువత గొంతుకగా యువజన కాంగ్రెస్

ఈ సందర్భంగా శివంత్ రెడ్డి మాట్లాడుతూ 1960 ఆగస్టు 9న ఇందిరా గాంధీ నాయకత్వంలో ప్రారంభమైన యువజన కాంగ్రెస్, నాటి నుంచి నేటి వరకు యువత గొంతుకగా, ప్రజాస్వామ్య పరిరక్షణకు పోరాట శక్తిగా ఎదిగిందని అన్నారు. యువజన కాంగ్రెస్ అంటే కేవలం ఒక సంస్థ కాదని, పోరాటం, త్యాగం, యువ నాయకత్వానికి ప్రతీక అని పేర్కొన్నారు.

### హక్కుల కోసం చివరి వరకు పోరాటం

యువజన కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా యువత హక్కుల కోసం, ప్రజా సమస్యల పరిష్కారం కోసం, రాజ్యాంగ పరిరక్షణ కోసం చివరి వరకు పోరాడుతామని నాయకులు ప్రతిజ్ఞ చేశారు. యువతను రాజకీయ, సామాజిక రంగాల్లో ముందుకు తీసుకెళ్లడంతో పాటు ప్రజా సమస్యలపై నిరంతరం ఉద్యమిస్తామని శివంత్ రెడ్డి తెలిపారు.

### భారీగా పాల్గొన్న కాంగ్రెస్ శ్రేణులు

కార్యక్రమంలో మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, మహబూబ్‌నగర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సంజీవ్ ముదిరాజ్, జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు అవేజ్ అహ్మద్, ఉపాధ్యక్షులు మహేశ్, శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి సంజీవ్ రెడ్డి, మహబూబ్‌నగర్ నియోజకవర్గ అధ్యక్షుడు సల్మాన్ తదితరులు పాల్గొన్నారు. జిల్లా కాంగ్రెస్ నాయకులు, యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

## కేంద్ర ప్రభుత్వ కార్మిక రైతాంగ విధానాలకు వ్యతిరేకంగా

## ఆగష్టు 10న జైల్ బరోను జయప్రదం చేయండి.

**సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు కడారి నాగరాజు.**



మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్ ) కార్పొరేట్ కంపెనీలు, విదేశీ స్వదేశీ సంస్థలకు లాభాలు తెచ్చే విధంగా, సాధారణ ప్రజలు కార్మికులను మోసం చేసే విధంగా తయారుచేసిన కార్మిక కోడులు, నూతన విత్తన చట్టం, వ్యాపార ఒప్పందాలు, విబిజి రాంజీ పథకం రద్దు చేయాలని సిఐటియు మెదక్ జిల్లా ఉపాధ్యక్షులు కడారి నాగరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం నర్సాపూర్ పట్టణంలో సీఐటీయూ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం నుండి బస్సు స్టాప్ వరకు 2ఎ రన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో దేశ వ్యాప్తంగా సీఐటీయూ, రైతు, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఆగష్టు 10న జైల్ బారో కార్యక్రమం జయప్రదం చేయాలనీ పిలుపునిచ్చారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రజలు కార్మికులు రైతాంగం కోసం కాకుండా కార్పొరేట్ కంపెనీలు, విదేశీ సంస్థల కోసం పనిచేస్తుందని, అందుకు ఈ చట్టాలు, పథకాలు ఉదాహరణ తెలిపారు. నిత్యవసర సర్కుల ధరలు, విద్యా వైద్యము రోజు వారి ఖర్చులు రేపు ప్రజలు అల్లాడుతుంటే జీతాలు పెంచకుండా కార్మిక సంఘాలను నిర్వీర్యం చేసే విధంగా చట్టాలు మార్పు చేసిందని కేంద్రంలో మానవత్వం లేని ప్రభుత్వం ఉందని అన్నారు. పరిశ్రమలో, రోజువారి వీధుల్లో భద్రత ప్రమాణాలు లేకుండా చేసిందని, హెయిర్ అండ్ ఫైర్ విధానంతో కార్మిక ఉద్యోగ భద్రత ఉప్పు తెచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. శాశ్వత పని ప్రాంతంలో కాంట్రాక్టు నేమ్స్ నాట్స్ స్టాఫ్ పేరుతో కనీస ప్రమాణాలు పాటించకుండా ఉద్యోగ భద్రత లేని కార్మికులను నియమించుకోవాలని తెలిపిందని మండిపడరు. వ్యాపార ఒప్పందాలతో పత్తి, కోడి, పామాయిల్, బిన్నీస్ వివిధ రకాల సరుకులను పన్నులు లేకుండా దిగుమతి చేసుకోవడానికి ఒప్పందం కుదుర్చుకొని భారత రైతులను ఆర్థికంగా దివాలా తీయించి భూమి నుండి రైతును వేరే చేసే విధంగా కుట్రలు చేస్తుందని అన్నారు. ఎరువులకు యాప్స్ తెచ్చి సబ్సిడీ తొలగించిందని, పత్తి కొనుగోలు ఎకరానికి ఏడు క్వింటాళ్లు మాత్రమే, వరిని కొనుగోలు చేయమని రైతులకు వ్యతిరేకంగా నిర్ణయాలు చేసి అమలు చేయడం జరుగుతుందన్నారు. ఉపాధి హామీ పని దినాలు ఫోటోలు రాకుండా ఏర్పాటుచేసి పేదల ఉపాధి హామీ పథకాన్ని దెబ్బతీసిందని అన్నారు. కార్పొరేట్ కంపెనీలకు కోట్ల రూపాలు రాయితీలు సబ్సిడీలు రుణమాఫీలు చేస్తున్న ప్రభుత్వం పేదలు కార్మికులు రైతాంగాన్ని రోడ్న వేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. 10 న జరిగే జైల్ భరో కార్యక్రమంలో కార్మికులు రైతాంగం ఉపాధి కూలీలు పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం లో రాములు, ఎల్లం, శంకరయ్య, నాగయ్య, అశోక్, కుమార్, క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

## బోనం ఎత్తిన మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మదేవేందర్ రెడ్డి



మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్ ) శ్రీశ్రీశ్రీ ఉజ్జయిని మహంకాళి జాతర ఉత్సవాల్లో భాగంగా ఆదివారం తూప్రాన్‌లో నిర్వహించిన మహంకాళి అమ్మవారి బోనాల వేడుకలు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరిగాయి. మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మదేవేందర్ రెడ్డి, తూప్రాన్ మున్సిపల్ చైర్మన్ బొంది రజిని రవీందర్ గౌడ్, వైస్ చైర్మన్ కొక్కంద సమతా కాశిరెడ్డిలు మహిళలతో కలిసి బోనం ఎత్తుకుని అమ్మవారికి సమర్పించారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పద్మదేవేందర్ రెడ్డి మాట్లాడుతూ.. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బోనాల పండుగ ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. భక్తిశ్రద్ధలతో జాతర ఉత్సవాలను నిర్వహించడం అభినందనీయమన్నారు. అమ్మవారి కృపతో తూప్రాన్ ప్రాంతం సుభిక్షంగా ఉండాలని, ప్రజలందరిపై శ్రీ ఉజ్జయిని మహంకాళి అమ్మవారి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# దేవాలయాన్ని కూల్చారు.. ?

# భక్తుల విశ్వాసాన్ని కూల్చగలరా.?

**- 120 ఏళ్ల ఆలయ చరిత్రకు సమాధి ఎందుకు.?- కూల్చిన స్థలంలోనే ఆలయం పునర్నిర్మించాలి. 500 గజాల స్థలం కేటాయించాలి**

**- ప్రభుత్వం హిందూ దేవాలయాల పట్ల వివక్ష చూపొద్దు: పల్లె - వినోద్ కుమార్ చిన్నబోయిన నవీన్ యాదవ్**

హైదరాబాద్( ప్రశ్న న్యూస్) హిందూ దేవాలయాల పరిరక్షణపై ప్రభుత్వం స్పష్టమైన విధానం అవలంబించాల్సిన సమయం ఆసన్నమైంది. శతాబ్దానికి పైగా చరిత్ర కలిగిన ఆలయాన్ని తొలగించి భక్తుల మనోభావాలను దెబ్బతీయడం ఎంతవరకు సమంజసం అంటూ బంజారాహిల్స్ ఎమ్మెల్యే కాలనీ పరిసరాల్లోని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. కూల్చివేసిన ఆలయ స్థలంలోనే వెంటనే ఆలయ నిర్మాణం చేపట్టాలని, కనీసం 500 గజాల ప్రభుత్వ స్థలాన్ని కేటాయించి ఆలయ పునర్నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలని ఆలయ కమిటీ సభ్యులు పల్లె వినోద్ కుమార్ చిన్నబోయిన నవీన్ యాదవ్ కోరుతున్నారు.

### 120 ఏళ్ల ఆలయ చరిత్రకు ముగింపు పలికారా.?

బంజారాహిల్స్ ఎమ్మెల్యే కాలనీ సమీపంలోని ప్రభుత్వ భూమి పరిధిలోని సర్వే నంబర్ 102/1 వద్ద పాత పెద్దమ్మ దేవాలయం సుమారు 120 సంవత్సరాలుగా ఉందని ఆలయ కమిటీ సభ్యులు, స్థానికులు చెబుతున్నారు. ఏటా బోనాలు, దసరా, వినాయక చవితి వంటి పండుగలను ఘనంగా నిర్వహించడం ఇక్కడ ఆనవాయితీగా వస్తోందని పేర్కొన్నారు.
అయితే జూలై 23, 2025న అధికారులు ఆలయాన్ని పూర్తిగా కూల్చివేశారని, అమ్మవారి విగ్రహంను తొలగించి తరలించారని కమిటీ సభ్యులు, స్థానికులు ఆరోపిస్తున్నారు. ఆలయాన్ని తొలగించే ముందు భక్తుల మనోభావాలను, ఆలయ చారిత్రక ప్రాధాన్యతను పరిగణనలోకి తీసుకున్నారా.? అనే ప్రశ్నలు ఇప్పుడు తెరపైకి వచ్చాయి.

### బోనాలు చేసుకునేందుకు కూడా అనుమతి లేదా?

ఈ ఏడాది పూజలు, బోనాలు నిర్వహించుకునే అవకాశం కల్పించాలని కోరుతూ ఆలయ కమిటీ సభ్యులు సీనియర్ న్యాయవాదులు బ్రహ్మదండి రమేష్, శివప్రసాద్, పల్ల రాధికా శర్మ ద్వారా హైకోర్టును ఆశ్రయించినట్లు తెలిపారు. గతంలోనూ ఈ అంశంపై రిట్ పిటిషన్ దాఖలు చేసినట్లు పేర్కొన్నారు.
హైకోర్టులో సీనియర్ న్యాయవాది బ్రహ్మదండి రమేష్ వాదనలు వినిపిస్తూ కనీసం ఈ ఏడాది ఆగస్టులో బోనాలు నిర్వహించుకునేలా అనుమతి ఇవ్వాలని కోరినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఏఏజీ కూడా వాదనలు వినిపించినప్పటికీ, పూజలు నిర్వహించేందుకు అనుమతి లభించకపోవడం బాధాకరమని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



ఆలయం కూల్చి వేసిన దృశ్యం

### 200 గజాల నుంచి 500 గజాల వరకు స్థలం కేటాయించండి

ఆలయ పునర్నిర్మాణం కోసం తొలుత సుమారు 200 గజాల స్థలం కేటాయించాలని కోరామని, ప్రస్తుతం ఆలయ నిర్మాణం, భక్తుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని కనీసం 500 గజాల స్థలం కేటాయించాలని పల్లె వినోద్ కుమార్, చిన్నబోయిన నవీన్ యాదవ్ కోరారు. గతంలో ఎండోమెంట్ కమిషనర్, జీహెచ్ఎంసీ కమిషనర్ సైతం ఆలయ నిర్మాణానికి స్థలం కేటాయిస్తామని హామీ ఇచ్చారని, అయితే ఆ హామీలు అమలుకు నోచుకోవడం లేదని ఆరోపిస్తున్నారు.



120 సంవత్సరాల నుండి ఉన్న అమ్మవారి ఆలయం

### అన్యమత ప్రార్థనా స్థలాల విషయంలోనూ ఇదే వైఖరేనా.?

తమ ఆలయాన్ని తొలగించినట్లే ఇతర మతాలకు చెందిన ప్రార్థనా స్థలాలను కూడా తొలగించేవారా.? అని ఆలయ కమిటీ సభ్యులు ప్రశ్నిస్తున్నారు. హిందూ దేవాలయాల విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందనే భావన కలగకుండా తక్షణమే స్పష్టమైన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.
120 ఏళ్ల చరిత్ర కలిగిన పాత పెద్దమ్మ తల్లి ఆలయాన్ని తిరిగి అదే ప్రాంతంలో పునరుద్ధరించి, ప్రభుత్వ స్థలంలో 500 గజాలు కేటాయించడంతో పాటు ఆలయ నిర్మాణానికి అవసరమైన నిధులు మంజూరు చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ఈ వ్యవహారంపై హైకోర్టు పూర్తిస్థాయి విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తెచ్చి హిందూ ఆలయాలకు ప్రాధాన్యత కల్పించాలని కమిటీ సభ్యులు కోరుతున్నారు.

## మహంకాళి అమ్మవారి ఆశీస్సులతో

## ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలి

**బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కంఠారెడ్డి. తిరుపతిరెడ్డి**



మెదక్ ప్రతినిధి( ప్రశ్న న్యూస్ ) శ్రీ మహంకాళి అమ్మవారి ఆశీస్సులతో ప్రజలంతా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కంఠారెడ్డి. తిరుపతిరెడ్డి ఆకాంక్షించారు. రామాయంపేట పట్టణంలో ఆదివారం శ్రీ మహంకాళమ్మ అమ్మవారి బోనాల ఉత్సవం వైభవంగా జరిగింది. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో తిరుపతిరెడ్డి పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బోనాల పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని తిరుపతిరెడ్డి అన్నారు. తరతరాలుగా వస్తున్న ఆధ్యాత్మిక, సాంస్కృతిక సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. అమ్మవారి కృపతో ప్రజల జీవితాల్లో ఆనందం, శాంతి, సౌభాగ్యం వెల్లివిరియాలని కోరుకున్నట్లు తెలిపారు. బోనాల ఉత్సవాన్ని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించిన ఉత్సవ కమిటీ సభ్యులను ఆయన అభినందించారు. అనంతరం ఆలయ అర్చకులు కంఠారెడ్డి. తిరుపతిరెడ్డిని శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, యువత, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## అర్చన కాలనీలో ఘనంగా బోనాలు



మేడ్చల్( ప్రశ్న న్యూస్ )ఆషాఢ బోనాల సందర్భంగా మేడ్చల్ సర్కిల్ పరిధిలోని కిష్టాపూర్ – పూడూరు డివిజన్‌లో గల కిష్టాపూర్ అర్చన కాలనీలో ఆదివారం నల్లపోచమ్మ అమ్మవారికి భక్తిశ్రద్ధలతో బోనాలను సమర్పించారు. ఉదయం ఘటమును ఊరేగింపుగా తీసుకొని వచ్చి అమ్మవారికి సమర్పించడం జరిగింది. అనంతరం కాలనీ మహిళలు సంప్రదాయ దుస్తుల్లో బోనాలను అలంకరించి, నల్లపోచమ్మ అమ్మవారికి సమర్పించారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ పరిసరాలు భక్తులతో సందడిగా మారాయి. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని భక్తులు కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు, మహిళలు, యువత, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మంథని బ్లాక్ కాంగ్రెస్

## తోట్ల తిరుపతి యాదవ్ కార్యాలయంలో

**ఘనంగా యూత్ కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు**



మంథని ( ప్రశ్న న్యూస్ ) రామగిరి: –మండల కేంద్రంలో యూత్ కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను అరెల్లి మహేందర్ గౌడ్ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంథని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తొట్ల తిరుపతి యాదవ్ హాజరై కేక్ కట్ చేసి వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా బ్లాక్ కాంగ్రెస్ నాయకులు తోట్ల తిరుపతి యాదవ్ మాట్లాడుతూ..శ్రీ దేశంలో ప్రజాస్వామ్య పరిరక్షణతో పాటు యువతను రాజకీయాల్లో భాగస్వామ్యం చేయడంలో యూత్ కాంగ్రెస్ కీలక పాత్ర పోషిస్తోందన్నారు. యువతకు కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ ప్రాధాన్యత ఇస్తుందని, ప్రజా సమస్యల పరిష్కారానికి యువ నాయకులు ముందుండి పనిచేయాలని పిలుపునిచ్చారు. యూత్ కాంగ్రెస్ నాయకులు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఐక్యంగా పనిచేస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు తోట్ల తిరుపతి యాదవ్ సూచించారు. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతూ, యువతకు అండగా నిలవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి జిల్లా కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షులు ఎల్లే రామమూర్తి, రామగిరి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రొడ్డ బాపన్న మాజీ ఎంపీపీ అరెల్లి దేవక్క కొమురయ్య గౌడ్,రామగిరి మండల కాంగ్రెస్ పార్టీ ఓబీసీ అధ్యక్షులు బంధారి సదానంద్, రామగిరి మండల కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షులు కండె పోషం, మాజీ సర్పంచ్ ఎరుకల ఓదేలు, తీగల సమ్మయ్య, సర్పంచ్ లు వనం రామచంద్ర రావు, పుల్లెల కొమరయ్య, ఇల్లందుల సంజీవ్. యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు మోత్కూర్ అవినాష్,గణపతి, కాల్వ శ్రీను, మల్లేష్, రమేష్, పెద్దపల్లి జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఉప సర్పంచ్, రామగిరి మండల కాంగ్రెస్ పార్టీ అన్ని గ్రామ శాఖల అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ కుటుంబ సభ్యులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పీజీ హాస్టల్‌లో నివసిస్తున్న విద్యార్థిని..

## మెడకు వైరు చుట్టి సెక్యూరిటీ గార్డు అత్యాచారం

గాంధీనగర్: ఒక విద్యార్థిని పీజీ వసతి గృహంలో నివసిస్తున్నది. రాత్రి వేళ వాకింగ్ కోసం టెర్రస్‌పైకి ఆమె వెళ్లింది. అక్కడ ఉన్న సెక్యూరిటీ గార్డు ఆ యువతి మెడకు వైరు బిగించి ఆమెపై అత్యాచారానికి పాల్పడ్డాడు. అక్కడి నుంచి పారిపోయిన ఆ నిందితుడ్ని పోలీసులు అరెస్ట్ చేశారు. గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో ఈ సంఘటన జరిగింది. ఒక యువతి ఇంటీరియర్ డిజైనింగ్ చదువుతున్నది. ఆనంద్‌నగర్ ప్రాంతంలోని పేయింగ్ గెస్ట్ (పీజీ) వసతి గృహంలో ఆమె నివసిస్తున్నది. కాగా, ఆగస్ట్ 8న డిన్నర్ తర్వాత వాకింగ్ కోసం రాత్రి 10 గంటల సమయంలో హాస్టల్ బిల్డింగ్ టెర్రస్‌పైకి ఆ యువతి వెళ్లింది. అక్కడ సెక్యూరిటీ గార్డు ఉండటంతో కిందకు వచ్చేందుకు ఆమె ప్రయత్నించింది. అయితే సెక్యూరిటీ గార్డు ఆ మహిళ మెడకు వైరు చుట్టి బంధించాడు. ఆమెపై అత్యాచారానికి పాల్పడ్డాడు. ఆ తర్వాత అక్కడి నుంచి పారిపోయాడు. గాయాలతో ఉన్న ఆ యువతిని గుర్తించి ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. మరోవైపు ఫిర్యాదు అందుకున్న పోలీసులు వెంటనే స్పందించారు. పీజీ హాస్టల్‌లోని సీసీటీవీ ఫుటేజ్‌ను పరిశీలించారు. అక్కడ సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్న ధరమ్ సింగ్‌ను నిందితుడిగా గుర్తించారు. శనివారం రాత్రంగా వెతికిన పోలీసులు చివరకు ఆదివారం ఉదయం అతడ్ని అరెస్ట్ చేశారు. నిందితుడు ధరమ్ సింగ్ ఉత్తరప్రదేశ్‌లోని హర్దోయ్ జిల్లాకు చెందిన వ్యక్తిని అని పోలీస్ అధికారి తెలిపారు. కొద్ది రోజుల కిందటే ఆ పీజీ హాస్టల్‌లో సెక్యూరిటీ గార్డుగా అతడు చేరినట్లు చెప్పారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

## నేతన్నకు కేంద్రం అండ..

# చేనేతకు కొత్త ఊపిరి

**అగ్గిపెట్టెలో ఇమిడే చీరల తయారీ నైపుణ్యానికి గుర్తింపు**

**- ఎంపీ రఘునందన్‌రావు**

**పద్మశాలి ఫంక్షన్ హాల్‌కు రూ.20 లక్షలు ఎంపీ నిధులు**

**- వంటశాలకు రూ.10 లక్షలతో శంకుస్థాపన**



గజ్వేల్ ( ప్రశ్న న్యూస్ ) అగ్గిపెట్టెలో ఇమిడే చీరలను తయారు చేసే అరుదైన నైపుణ్యం కలిగిన నేత కార్మికులను గుర్తించి, వారి ప్రతిభకు తగిన ప్రోత్సాహం అందించేందుకు కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోందని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు అన్నారు. చేనేత కార్మికుల ఆర్థికాభివృద్ధి కోసం బ్యాంకుల ద్వారా రాయితీపై రుణాలు అందించడంతో పాటు చేనేత రంగాన్ని మరింత బలోపేతం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతోందని తెలిపారు.సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణంలోని పద్మశాలి సంఘం భవనం వద్ద రూ.10 లక్షల వ్యయంతో నిర్మించనున్న వంటశాల నిర్మాణానికి ఆదివారం ఎంపీ రఘునందన్‌రావు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశానికి రైతులు, చేనేత కార్మికులు వెన్నెముక లాంటి వారని పేర్కొన్నారు.గజ్వేల్ పట్టణంలోని పద్మశాలి ఫంక్షన్ హాల్ అభివృద్ధి కోసం తన ఎంపీ నిధుల నుంచి రూ.20 లక్షలు మంజూరు చేస్తున్నట్లు రఘునందన్‌రావు ప్రకటించారు. ఫంక్షన్ హాల్ పూర్తిస్థాయిలో అందుబాటులోకి వచ్చేలా తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.తరతరాలుగా వస్తున్న చేనేత కళను కాపాడటంతో పాటు నేతన్నల జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. చేనేత కార్మికులకు రుణ సదుపాయాలతో పాటు నైపుణ్యాభివృద్ధి, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, మార్కెటింగ్ సౌకర్యాలు కల్పించేందుకు కేంద్రం చర్యలు తీసుకుంటోందని తెలిపారు.చేనేత ఉత్పత్తులకు దేశీయంగానే కాకుండా అంతర్జాతీయ మార్కెట్‌లోనూ విస్తృత గుర్తింపు తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. అగ్గిపెట్టెలో ఇమిడే చీరల వంటి అరుదైన కళాత్మక ఉత్పత్తులను తయారు చేసే నైపుణ్యం తెలంగాణ చేనేత కార్మికుల ప్రతిభకు నిదర్శనమని అన్నారు.చేనేత రంగాన్ని ఆధునిక అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి చేసి, నేత కార్మికులకు మెరుగైన ఉపాధి, ఆదాయ అవకాశాలు కల్పించడమే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమని రఘునందన్‌రావు పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను నేత కార్మికులు సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని సూచించారు.ఈ కార్యక్రమంలో బీజేపీ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్ ముదిరాజ్, మాజీ మున్సిపల్ చైర్మన్ గాడిపల్లి భాస్కర్, పద్మశాలి సంఘం అధ్యక్షుడు దేవదాస్, చేనేత సహకార సంఘం అధ్యక్షుడు స్వర్గం రాజేశం, పద్మశాలి సంఘం కుటుంబ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## ఎంపీ రఘునందన్‌రావును కలిసిన గజ్వేల్ ఫోటోగ్రాఫర్స్ అసోసియేషన్ సభ్యులు

**సంఘం భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని వినతి -- సానుకూలంగా స్పందించిన ఎంపీ**



గజ్వేల్ ( ప్రశ్న న్యూస్ ) సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండల ఫోటో, వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ ప్రతినిధులు మెదక్ ఎంపీ రఘునందన్‌రావును మర్యాదపూర్వకంగా కలిశారు. అసోసియేషన్ అధ్యక్షుడు బొల్లిబత్తుల నాగరాజు ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు ఎంపీని కలిసి ఫోటోగ్రాఫర్లకు సంబంధించిన పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు.ఈ సందర్భంగా అధ్యక్షుడు బొల్లిబత్తుల నాగరాజు మాట్లాడుతూ గజ్వేల్ మండల ఫోటోగ్రాఫర్స్ అసోసియేషన్‌కు సొంత భవనం నిర్మించుకునేందుకు ఎంపీ నిధుల నుంచి ఆర్థిక సహాయం అందించాలని రఘునందన్‌రావును కోరినట్లు తెలిపారు. తమ విజ్ఞప్తిపై ఎంపీ సానుకూలంగా స్పందించారని, రాబోయే రోజుల్లో సంఘం భవన నిర్మాణంతో పాటు అసోసియేషన్ అభివృద్ధికి తనవంతు పూర్తి సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారని పేర్కొన్నారు.ఫోటో, వీడియో గ్రాఫర్ల సమస్యలను పరిష్కరించేందుకు ఎంపీ సానుకూలంగా స్పందించడం పట్ల అసోసియేషన్ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. తమ విజ్ఞప్తికి సానుకూలంగా స్పందించిన ఎంపీ రఘునందన్‌రావుకు అసోసియేషన్ తరపున నాగరాజు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు డబ్బేట సురేష్, ప్రధాన కార్యదర్శి బాకీ శ్రీనివాస్, కోశాధికారి ఆల్వాల యాదగిరి, సీనియర్ ఫోటోగ్రాఫర్లు, మండల వ్యాప్తంగా ఉన్న ఫోటోగ్రాఫర్లు, వీడియో గ్రాఫర్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## గజ్వేల్‌లో ఘనంగా శాకాంబరీ ఉత్సవాలు

**ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో వాసవి మాతకు ప్రత్యేక పూజలు**

**రంగురంగుల కూరగాయల అలంకరణలో శాకాంబరీ దేవిగా దర్శనమిచ్చిన అమ్మవారు**



గజ్వేల్ ( ప్రశ్న న్యూస్ ) సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణంలోని శ్రీ సీతారామ ఉమామహేశ్వర ఆలయంలో కొలువుదీరిన శ్రీ వాసవి మాత ఆలయంలో శాకాంబరీ ఉత్సవాలను ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా నిర్వహించారు.ఉత్సవాల్లో భాగంగా వాసవి మాతను వివిధ రకాల రంగురంగుల తాజా కూరగాయలు, ఆకుకూరలతో అత్యంత మనోహరంగా అలంకరించారు. శాకాంబరీ దేవి అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమివ్వడంతో ఆలయ ప్రాంగణం భక్తులతో కిక్కిరిసింది.ఈ సందర్భంగా ఆలయంలో గోపూజ, సామూహిక కుంకుమార్చన, అమ్మవారి పారాయణం తదితర విశేష పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలతో పాటు మహా అన్నప్రసాదాన్ని పంపిణీ చేశారు.ఈ సందర్భంగా నాచారం దేవస్థానం డైరెక్టర్ జగ్గయ్యగారి శేఖర్, కిరాణా అసోసియేషన్ అధ్యక్షుడు సిద్ది బిక్షపతి, సీనియర్ నాయకుడు నంగునూరి సత్యనారాయణ మాట్లాడుతూ.. అమ్మవారి కరుణ ఉంటే అంతా మంచే జరుగుతుందని అన్నారు. ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని వాసవి మాతకు విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు.శాకాంబరీ మాతగా పూజలందుకున్న వాసవి మాత కరుణాకటాక్షాలు ప్రజలందరిపై ఉండాలని, సకాలంలో వర్షాలు కురిసి ప్రజలంతా సుఖసంతోషాలతో, సుభిక్షంగా ఉండాలని అమ్మవారిని ప్రార్థించినట్లు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య మహిళలు, ఆర్యవైశ్య సంఘం నాయకులు, భక్తులు, తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కే.ఎల్.ఆర్ వెంచర్ శ్రీ కాలనీలో

# ఘనంగా ఎల్లమ్మ బోనాలు

**భక్తిశ్రద్ధలతో అమ్మవారికి బోనాలు సమర్పించిన భక్తులు**

**మొక్కులు చెల్లించుకునేందుకు భారీగా తరలివచ్చిన భక్తజనం**

**ఆలయ అభివృద్ధి, కార్యక్రమాల్లో ముందుండి సేవలందిస్తున్న గాంధీ యాదవ్ కి ఘన సన్మానం**

**అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్న ఆలయ నిర్వాహకులు**





మేడ్చల్ (ప్రశ్న న్యూస్ )కే.ఎల్.ఆర్ వెంచర్ శ్రీ కాలనీలో శ్రీ ఎల్లమ్మ తల్లి బోనాల పండుగను భక్తిశ్రద్ధలతో, ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి మొక్కులు చెల్లించుకునేందుకు కాలనీతో పాటు పరిసర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు బోనాలతో తరలిరావడంతో ఆలయ పరిసరాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి.

### బోనాలతో భక్తుల సందడి

ఎల్లమ్మ తల్లికి బోనాలు సమర్పించేందుకు మహిళలు సంప్రదాయ దుస్తుల్లో, బోనాలను అలంకరించుకుని ఆలయానికి తరలివచ్చారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారి ఆశీస్సులతో కుటుంబాలు సుఖసంతోషాలతో ఉండాలని, ప్రజలందరూ ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని భక్తులు ప్రార్థించారు.

### భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు

బోనాల సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం నుంచే ఆలయానికి భక్తుల రాక కొనసాగింది. అమ్మవారికి బోనాలు సమర్పిస్తూ భక్తులు తమ భక్తిని చాటుకున్నారు. ఆలయ పరిసరాల్లో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

### ఆలయ ఇన్‌చార్జ్ గాంధీయాదవ్ కి ఘన సన్మానం

ప్రతియేటా ఆలయ బాధ్యతలను స్వీకరిస్తూ పలు కార్యక్రమాలను ముందుండి నిర్వహిస్తున్న ఆలయ ఇన్‌చార్జ్ గాంధీయాదవ్ ని ఈ సందర్భంగా రమణారెడ్డి, తేజబాబు, రాజశేఖర్ గౌడ్, మధుసూదన్ రెడ్డి, నారాయణ తదితరులు ఘనంగా సన్మానించారు.

గాంధీయాదవ్ కి శాలువా కప్పి సత్కరించి, ఆలయ కార్యక్రమాల నిర్వహణలో ఆయన అందిస్తున్న సేవలను అభినందించారు.

### కార్యక్రమాలు విజయవంతం కావడంలో గాంధీయాదవ్ సేవలు

ఈ సందర్భంగా రమణారెడ్డి మాట్లాడుతూ, ప్రతియేటా ఎల్లమ్మ తల్లి ఆలయంలో భక్తుల కోసం అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తూ వస్తున్నారని తెలిపారు. ఆలయంలో ఏ కార్యక్రమం జరిగినా గాంధీయాదవ్ ముందుండి నిర్వహిస్తూ అందరినీ కలుపుకొని కార్యక్రమాలను విజయవంతం చేస్తున్నారని కొనియాడారు.

ఆలయ కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తూ, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయడంలో గాంధీయాదవ్ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు.

ఎల్లమ్మ తల్లి అందరినీ చల్లగా చూడాలిఎల్లమ్మ తల్లి ఆశీస్సులు ప్రతి కుటుంబంపై ఉండాలి. ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకుంటున్నాం. ప్రతి సంవత్సరం అమ్మవారి బోనాల కార్యక్రమాన్ని మరింత ఘనంగా నిర్వహించాలి. ఆలయ కార్యక్రమాల్లో అందరూ భాగస్వాములు కావాలి" అని రమణారెడ్డి ఆకాంక్షించారు

### భక్తులకు అన్నదానం

బోనాల సందర్భంగా భక్తుల కోసం అన్నదాన కార్యక్రమాన్ని కూడా నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకున్న అనంతరం భక్తులు అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. నిర్వాహకులు భక్తులకు అవసరమైన ఏర్పాట్లు చేయడంతో కార్యక్రమం ప్రశాంతంగా కొనసాగింది.

### ఐక్యతకు ప్రతీకగా ఎల్లమ్మ బోనాలు

ఎల్లమ్మ బోనాల పండుగ కేవలం ఆధ్యాత్మిక కార్యక్రమమే కాకుండా కాలనీవాసులను, భక్తులను ఒకచోటికి చేర్చే ఐక్యతా వేదికగా నిలిచింది. చిన్నారులు, మహిళలు, యువత, పెద్దలు పెద్ద సంఖ్యలో పాల్గొనడంతో శ్రీ కాలనీ అంతా పండుగ వాతావరణాన్ని సంతరించుకుంది. అమ్మవారి ఆశీస్సులతో ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో ఉండాలని, ప్రజలందరికీ మంచి జరగాలని భక్తులు ఆకాంక్షించారు.

## ప్రపంచ ఆదివాసి దినోత్సవానికి

# అధికారులు డుమ్మా- ఆదివాసీల ఆగ్రహం

**ఐటీడీఏ పీఓ, కలెక్టర్ గైర్హాజరుపై ఆగ్రహం.**

**సమస్యలు ఎవరికి చెప్పుకోవాలి.?**

**ఆదివాసీల గోడు వినే సమయం లేదా.?**

**వెంటనే స్పందించాలని డిమాండ్.**






నిర్లక్ష్యం కొనసాగితే ఉద్యమమే. ఆదివాసీ సంఘాల హెచ్చరిక

ములుగు ( ప్రశ్నన్యూస్) ప్రపంచ ఆదివాసి దినోత్సవం సందర్భంగా ఏటూరునాగారంలో ఆదివాసీ సమాజం నిర్వహించిన భారీ కార్యక్రమానికి స్థానిక ఐటీడీఏ పీఓ, జిల్లా కలెక్టర్ హాజరు కాకపోవడం తీవ్ర విమర్శలకు తావిచ్చింది. ఆదివాసీల హక్కులు, సమస్యలపై చర్చించేందుకు ఇదే అత్యంత కీలకమైన వేదిక అని భావిస్తున్న తరుణంలో ఉన్నతాధికారుల గైర్హాజరు ఆదివాసీ సంఘాల్లో తీవ్ర ఆగ్రహం రేకెత్తించింది.ఆదివాసీ ప్రాంతాల అభివృద్ధి, జల్--జంగల్--జమీన్ పరిరక్షణ, పోడు భూముల గుర్తింపు, అటవీ హక్కుల చట్టం అమలు, విద్య, వైద్యం, ఉపాధి, రహదారులు, మౌలిక వసతులు వంటి అనేక సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలనే ఉద్దేశంతో వేలాదిగా ఆదివాసీలు తరలివచ్చారు. అయితే మెమోరాండాలు స్వీకరించి, సమస్యలపై స్పందించాల్సిన బాధ్యత కలిగిన అధికారులు కార్యక్రమానికి దూరంగా ఉండటంతో ఆశలు నిరాశగా మారాయి.

### భారీ ర్యాలీ, నివాళులు.

ఆదివారం ఉదయం ఏటూరునాగారం వై జంక్షన్ నుంచి ఐటీడీఏ కార్యాలయం వరకు ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. గిరిజన వీరుడు కొమురం భీమ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం గిరిజన భవన్‌లో సభ నిర్వహించారు. ములుగు జిల్లాలోని వివిధ మండలాలు, గ్రామాల నుంచి ఆదివాసీలు తమ డిమాండ్లతో కూడిన మెమోరాండాలను తీసుకువచ్చారు.సభలో పాల్గొన్న నాయకులు మాట్లాడుతూ ప్రపంచ ఆదివాసి దినోత్సవం రోజునే ఆదివాసీలను అధికారులు పట్టించుకోకపోతే ఇక ఇతర రోజుల్లో మా సమస్యలు ఎవరు పరిష్కరిస్తారని ప్రశ్నించారు. ఒకవైపు ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాల గురించి పెద్ద పెద్ద మాటలు. మరోవైపు మా గోడు వినేందుకు సమయం లేకపోవడం దారుణం అని ఆవేదన వ్యక్తం చేశారు.

### - పెండింగ్ సమస్యలపై ప్రత్యేక సమావేశం కోరిక

ఐటీడీఏ పరిధిలోని పెండింగ్ సమస్యలను పరిష్కరించేందుకు తక్షణమే ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయాలని ఆదివాసీ సంఘాలు డిమాండ్ చేశాయి. జిల్లా కలెక్టర్, ఐటీడీఏ పీఓ వెంటనే స్పందించి ఆదివాసీ సంఘాల ప్రతినిధులతో చర్చలు జరిపి కార్యాచరణ ప్రకటించాలని కోరారు. ఆదివాసీ ప్రాంతాల్లో ఇప్పటికీ తాగునీరు, సరైన వైద్య సదుపాయాలు, రహదారుల కొరత ఉందని, పోడు భూములకు పట్టాలు ఇవ్వడంలో జాప్యం జరుగుతోందని నాయకులు ఆరోపించారు. అటవీ హక్కుల చట్టం పూర్తిస్థాయిలో అమలు కావడం లేదని, దీనివల్ల ఆదివాసీలు తమ భూములను కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.




### ఉద్యమ హెచ్చరిక.

అధికారుల నిర్లక్ష్యం కొనసాగితే ప్రజాస్వామ్య పద్ధతిలో మరింత బలమైన ఉద్యమాలు చేపడతామని ఆదివాసీ సంఘాల నాయకులు హెచ్చరించారు. ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని ఆదివాసీల సమస్యలపై స్పష్టమైన హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

కార్యక్రమంలో వివిధ ఆదివాసీ సంఘాల నాయకులు, మహిళలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సాంప్రదాయ నృత్యాలతో వాతావరణం గిరిజన సంస్కృతిని ప్రతిబింబించింది.

### బాక్స్ ఐటమ్:

- పోడు భూములకు వెంటనే పట్టాల పంపిణీ
- అటవీ హక్కుల చట్టం పూర్తి అమలు
- గిరిజన ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పన
- ఐటీడీఏ పరిధిలో పెండింగ్ సమస్యలపై ప్రత్యేక సమావేశం

## మాజీ ఎమ్మెల్యే తూముకుంట నర్సారెడ్డిని కలిసిన సీపీఐ నాయకులు

**చేనేత కార్మికుల సమస్యలు, పెండింగ్ అభివృద్ధి పనులపై చర్చ**

గజ్వేల్ ( ప్రశ్న న్యూస్ )గజ్వేల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ మాజీ ఎమ్మెల్యే తూముకుంట నర్సారెడ్డిని సీపీఐ పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని పలు సమస్యలు, పెండింగ్ అభివృద్ధి పనులపై ఆయనతో చర్చించారు.సీపీఐ పార్టీ రాష్ట్ర మాజీ కౌన్సిల్ సభ్యుడు బట్టు దయానందరెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యుడు, గజ్వేల్ చేనేత సహకార కార్మిక సంఘం అధ్యక్షుడు స్వర్గం రాజేశం, గజ్వేల్ నియోజకవర్గ కార్యదర్శి శివలింగ కృష్ణ, సీపీఐ నాయకుడు స్వర్గం రాములు తదితరులు నర్సారెడ్డిని కలిసి సమస్యలను వివరించారు.

ముఖ్యంగా నిరుపేద చేనేత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంతో పాటు చేనేత సహకార సంఘం అభివృద్ధికి అవసరమైన చర్యలు చేపట్టాలని కోరారు. అలాగే గజ్వేల్ పట్టణంలో పెండింగ్‌లో ఉన్న రింగ్ రోడ్డు, బస్టాండ్ పనులను త్వరగా పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు.గజ్వేల్ నియోజకవర్గ పరిధిలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులు, కెనాల్ కాలువలు, ఇతర అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని నర్సారెడ్డిని కోరినట్లు సీపీఐ నాయకులు తెలిపారు.సీపీఐ నాయకులు ప్రస్తావించిన సమస్యలపై తూముకుంట నర్సారెడ్డి సానుకూలంగా స్పందించారు. వీలైనంత త్వరగా ఆయా సమస్యలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం అయ్యేలా తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.



# జెన్‌జీ గురించి వైసీపీ మాట్లాడటం విడ్డూరం

**- యువతను మత్తు పదార్థాలకు బానిసల్ని చేసింది ఆ పార్టీయే**

**- మంగళగిరిలో జనసేన నేతలు విజయ్‌కుమార్, విజయ్‌శేఖర్**



**మంగళగిరి(ప్రశ్న న్యూస్)** 'జెన్‌జీ గురించి వైసీపీ నాయకులు మాట్లాడటం విడ్డూరంగా ఉంది. గత ఐదేళ్ల పాలనలో యువతకు సకాలంలో ఉద్యోగ క్యాలెండర్ ఇచ్చారా.? మెగా డీఎస్సీ పేరుతో నిరుద్యోగులను మోసం చేశారు. యువతను మత్తు పదార్థాల వైపు నెట్టిన పార్టీ ఇప్పుడు జెన్‌జీ గురించి మాట్లాడటం హాస్యాస్పదం" అని జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఏపీ మాల వెల్ఫేర్ కార్పొరేషన్ ఛైర్మన్ డా. పెదపూడి విజయ్‌కుమార్ విమర్శించారు.ఆదివారం మంగళగిరిలోని జనసేన కేంద్ర కార్యాలయంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి, మాదిగ వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్ బేతపూడి విజయ్‌శేఖర్‌తో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా వైసీపీ నేతల విమర్శలను తిప్పికొట్టారు.

**అభివృద్ధి కనిపించడంలేదా.** కూటమి ప్రభుత్వం ఏర్పడిన రెండేళ్లలో ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ నిర్వహిస్తున్న పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల ద్వారా 8,571 కిలోమీటర్ల సీసీ రోడ్లు, వందల కిలోమీటర్ల బీటీ రోడ్లు నిర్మించినట్లు విజయ్‌కుమార్ తెలిపారు. 'అటవితల్లి బాట' కార్యక్రమం కింద డోలీ రహిత గ్రామాల కోసం 2,710 కిలోమీటర్ల రహదారుల నిర్మాణం చేపట్టినట్లు పేర్కొన్నారు."గత ప్రభుత్వ హయాంలో రోడ్ల అభివృద్ధిని పట్టించుకోలేదు. ఇప్పుడు జరుగుతున్న పనులు కనిపించకపోవడం ఆశ్చర్యంగా ఉంది. ప్రజా సమస్యలపై ఒక్కరోజైనా మాట్లాడని ఎర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్.. పవన్‌కల్యాణ్‌ను విమర్శించడం హాస్యాస్పదం" అని అన్నారు.

**చంద్రశేఖర్‌పై విమర్శలు** అసెంబ్లీకి వెళ్లి సంతకాలు చేసి వెళ్లిపోతున్నారంటూ ఎమ్మెల్యే చంద్రశేఖర్‌పై విజయ్‌కుమార్ విమర్శలు చేశారు. "పదవి పోతుందనే భయంతో శాసనసభకు దొంగచాటుగా వెళ్లి సంతకాలు చేసే వ్యక్తికి ప్రజల కోసం పనిచేస్తున్న పవన్‌కల్యాణ్‌ను విమర్శించే నైతిక హక్కు లేదు. జగన్‌ను మెప్పించేందుకు విమర్శలు చేయడం మానుకుని ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టాలి" అని సూచించారు.మార్కాపురంలో జలజీవన్ మిషన్ పనుల శంకుస్థాపన కార్యక్రమానికి అధికారికంగా ఆహ్వానించినా చంద్రశేఖర్ హాజరుకాలేదని ఆరోపించారు. నియోజకవర్గ అభివృద్ధిపై నిజంగా చిత్తశుద్ధి ఉంటే ఇలాంటి కార్యక్రమాలకు హాజరయ్యేవారని అన్నారు. ఎమ్మెల్యే పట్టించుకోకపోయినా నియోజకవర్గంలో దాదాపు రూ.200 కోట్లతో అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు.

**'జెన్‌జీ వార్' పేరుతో..** "జెన్‌జీ వార్ పేరుతో వైసీపీ కార్యక్రమాలు నిర్వహిస్తోంది. గత ఐదేళ్లలో యువతకు ఉద్యోగాలు కల్పించేందుకు ఏం చేశారు? డీఎస్సీ, కానిస్టేబుల్ ఉద్యోగాల భర్తీపై నిరుద్యోగుల్లో ఆశలు రేకెత్తించి నిరాశకు గురిచేశారు" అని విజయ్‌కుమార్ ఆరోపించారు. గంజాయి, మాదకద్రవ్యాల నియంత్రణలో గత ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు.

శస్త్రచికిత్స అనంతరం విధుల్లోకి పవన్‌కల్యాణ్‌కు శస్త్రచికిత్సలు జరిగినా కొద్దిరోజులకే విధులకు హాజరై అధికారులతో సమీక్షలు నిర్వహిస్తున్నారని విజయ్‌కుమార్ తెలిపారు. ప్రజా సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధిపై ఆయన నిబద్ధతకు ఇదే నిదర్శనమన్నారు.

హస్తకళాకారులకు వైద్య, నేత్ర శిబిరాలు నిర్వహించడం, అవసరమైన వారికి శస్త్రచికిత్సలు, కళ్లజోళ్లు అందించడం వంటి కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. జలజీవన్ మిషన్ కింద తాగునీటి సరఫరా కోసం రూ.7 వేల కోట్లతో మాస్టర్‌ప్లాన్ రూపొందిస్తున్నట్లు చెప్పారు. ఎర్రచందనం అక్రమ రవాణాపై చర్యలు, మానవ--వన్యప్రాణి సంఘర్షణల నివారణకు 'హనుమాన్ ప్రాజెక్టు' వంటి కార్యక్రమాలను ప్రస్తావించారు.

**వైసీపీ వృద్ధ నాయకులతో జెన్‌జీ వార్‌నా?** బేతపూడి విజయ్‌శేఖర్ మాట్లాడుతూ.. "యువశక్తిని నిర్వీర్యం చేసిన పార్టీ వైసీపీ. ఇప్పుడు యువత గురించి మాట్లాడే నైతిక హక్కు ఆ పార్టీకి లేదు. జెన్‌జీ వార్ పేరుతో నిర్వహిస్తున్న కార్యక్రమాల్లో యువత కంటే వృద్ధ వైసీపీ నాయకులే ఎక్కువగా కనిపిస్తున్నారు. ఇది విడ్డూరంగా ఉంది" అని అన్నారు.డీఎస్సీ అంశంపై బహిరంగ చర్చకు సిద్ధమా అని సవాల్ విసిరినా వైసీపీ నుంచి ఎవరూ ముందుకు రాలేదని పేర్కొన్నారు. జగన్‌ను మెప్పించేందుకు రాజకీయ విమర్శలు చేయకుండా ప్రజా సమస్యలపై నిర్మాణాత్మకంగా స్పందించాలని సూచించారు.

# ప్రియుడ్ని కలిసేందుకు తూటాలతో జైలుకు వెళ్లిన బాలిక..






లక్నో: ఒక బాలిక తన ప్రియుడ్ని కలిసేందుకు జైలు వద్దకు చేరుకున్నది. నకిలీ ఆధార్ కార్డ్ సమర్పించింది. చెకింగ్ సమయంలో ఆమె జేబులో పది లైవ్ బుల్లెట్లు లభించాయి. ఈ నేపథ్యంలో ఆ బాలికతో పాటు ఆమె వెంట ఉన్న వ్యక్తిని జైలు సిబ్బంది అదుపులోకి తీసుకున్నారు. (+అతీశ్రీ ఎఅంతుం జీుఅశ్రీ ఎశీ వీవవ్ నాశీజవతీ) ఉత్తరప్రదేశ్‌లోని గోండా జిల్లాలో ఈ సంఘటన జరిగింది. ప్రియుడైన హర్ష్ కశ్యప్ అనే ఖైదీని కలిసేందుకు మైనర్ బాలిక మరో వ్యక్తితో కలిసి గోండాలోని డివిజనల్ జైలుకు చేరుకున్నది.కాగా, జైలు ప్రధాన ద్వారం వద్ద భద్రతా తనిఖీ సమయంలో ఆ బాలిక తప్పుడు వివరాలు చెప్పింది. ఆధార్ కార్డులో ఉన్న పేరుకు భిన్నంగా ఆమె పేరు చెప్పింది. అనుమానించిన జైలు సిబ్బంది ఆ బాలికను తనిఖీ చేశారు. ఆమె జేబులో పది లైవ్ కార్ట్రిడ్జ్‌లు ఉండటం చూసి షాక్ అయ్యారు. ఆ బుల్లెట్లు, నకిలీ ఆధార్ కార్డుతో పాటు ఆమె వద్ద ఉన్న కొంత నగదును స్వాధీనం చేసుకున్నారు. ఆ బాలికతో పాటు ఆమె వెంట ఉన్న వ్యక్తిని జైలు అవుట్‌పోస్ట్ ఇన్‌ఛార్జ్‌కు అప్పగించారు.మరోవైపు విచారణ సమయంలో ఆ బాలిక తన అసలు వివరాలు వెల్లడించింది. తన వద్ద లభించిన తూటాలు తన తండ్రికి చెందిన లైసెన్స్ పిస్టల్‌కు సంబంధించినవని చెప్పింది. తన తండ్రికి కోపం ఎక్కువని, జైలులో ఉన్న తన ప్రియుడిని కలవడానికి వెళ్లిన విషయం తెలిస్తే తనను ఏమైనా చేయవచ్చని ఆందోళన వ్యక్తం చేసింది. అందుకే ఆ తూటాలను పిస్టల్ నుంచి తీసి తనతో పాటు తీసుకువచ్చినట్లు ఆ యువతి వివరించింది. అయితే ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు జైలు అధికారి వెల్లడించారు.

# గర్జనలో గాంభీర్యం అడవిలో రాజసం!

**- ఆగస్టు 10వ తారీఖున ప్రపంచ సింహాల దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం**

(వెంకట్ -- ప్రజా ప్రశ్న బ్యూరో, ఆంధ్ర ప్రదేశ్)



అడవిలో ఒక్కసారి గర్జిస్తే చాలు.. ఆ శబ్దం కిలోమీటర్ల దూరం వరకు వినిపిస్తుంది. నడకలో రాజసం.. చూపులో తీక్షణత.. వేటలో వేగం.. గుంపులో నాయకత్వం.. ఇవన్నీ కలగలిపిన అద్భుత జీవి సింహం. అందుకే సింహాన్ని అడవికి రారాజుగా పిలుస్తారు.

### గర్జనకు ఓ ప్రత్యేక శక్తి..

సింహం గర్జన వన్యప్రాణి ప్రపంచంలో ప్రత్యేకమైనది. తన ఉనికిని తెలియజేయడం, గుంపులోని ఇతర సింహాలతో సంబంధాలు కొనసాగించడం, ప్రత్యర్థులను హెచ్చరించడం వంటి అనేక సందర్భాల్లో గర్జన ఉపయోగపడుతుంది. ముఖ్యంగా రాత్రివేళ సింహం గర్జన మరింత దూరం వరకు వినిపిస్తుంది.

### జూలే.. మగ సింహానికి కిరీటం..

మగ సింహానికి ఉండే దట్టమైన జూలు దాని ప్రత్యేక గుర్తింపు. ప్రతి సింహం జూలు ఒకేలా ఉండదు. వయసు, ఆరోగ్యం, జన్యుపరమైన లక్షణాలు, హార్మోన్ల ప్రభావం వంటి అంశాలను బట్టి జూలు రంగు, పొడవు, సాంద్రతలో మార్పులు కనిపిస్తాయి. మగ సింహం రూపానికి జూలు మరింత రాజసాన్ని తెస్తుంది.

### వేటలో ఆడ సింహాలదే కీలక పాత్ర..

సింహాల గుంపులో ఆడ సింహాలు వేటలో అత్యంత చురుకుగా వ్యవహరిస్తాయి. గుంపుగా వేటాడటం ద్వారా పెద్ద జంతువులను కూడా ఎదుర్కొనే సామర్థ్యం వాటికి ఉంటుంది. ఒకదానికొకటి సహకరించుకుంటూ వేటను పూర్తి చేయడం వాటి ప్రత్యేకత. అయితే పరిస్థితిని బట్టి మగ సింహాలు కూడా వేటలో పాల్గొంటాయి.

### పిల్లలకు 'సింహాల స్కూల్'..

సింహపు పిల్లలు పుట్టిన వెంటనే వేటాడలేవు. తల్లి సింహాలను అనుసరిస్తూ క్రమంగా వేట పద్ధతులను నేర్చుకుంటాయి. ఆటల రూపంలో పరుగులు తీయడం, దూకడం, వెంటాడడం వంటి చర్యలు వాటి భవిష్యత్తు వేట నైపుణ్యాలకు పునాది వేస్తాయి.

### గుంపే బలం.. గుంపే రక్షణ..

సింహాల సామాజిక జీవనం ఇతర పెద్ద పిల్లుల కంటే భిన్నంగా ఉంటుంది. ఇవి సాధారణంగా గుంపులుగా జీవిస్తాయి. గుంపులో పిల్లల సంరక్షణ, వేట, ప్రాంత పరిరక్షణ వంటి పనుల్లో సభ్యులు పరస్పరం సహకరించుకుంటారు. అందుకే సింహాల జీవన విధానంలో 'గుంపు'కు అత్యంత ప్రాధాన్యం ఉంటుంది.

### నిద్రలోనూ రికార్డే..

సింహాలు రోజులో ఎక్కువ సమయం విశ్రాంతి తీసుకుంటాయి. వేటకు అవసరమైన శక్తిని నిల్వ చేసుకోవడానికి ఎక్కువసేపు విశ్రాంతి తీసుకోవడం వాటి సహజ ప్రవర్తన. ముఖ్యంగా పగటి వేడిలో నీడలో విశ్రాంతి తీసుకుని, చల్లని సమయాల్లో చురుకుగా మారుతాయి.

### అడవికి కాపలాదారు..

సింహం ఆహార గొలుసులో అగ్రస్థానంలో ఉండే మాంసాహారి. దాని ఉనికి అడవిలోని ఇతర జంతువుల జనాభా సమతుల్యతకు దోహదపడుతుంది. అందువల్ల సింహాన్ని సంరక్షించడం అంటే ఒక జంతు జాతిని మాత్రమే కాపాడటం కాదు.. మొత్తం అటవీ పర్యావరణ వ్యవస్థను పరిరక్షించడమే.

### భారత్‌లో ఆసియా సింహాల సామ్రాజ్యం..

మన దేశంలో ఆసియా సింహాలకు గుజరాత్‌లోని గిర్ అటవీ ప్రాంతం ప్రధాన సహజ ఆవాసంగా ఉంది. ఆసియా సింహాలు ప్రపంచంలోని సింహాల జనాభాలో ప్రత్యేక స్థానాన్ని కలిగి ఉన్నాయి. వాటి సంరక్షణకు చేపడుతున్న చర్యలు భారత వన్యప్రాణి సంరక్షణలో కీలకంగా నిలుస్తున్నాయి.


### రాజసం ఉండాలి.. అడవీ ఉండాలి..

అడవులు తగ్గిపోతే సింహాలకు ఆవాసాలు కరువవుతాయి. మానవ కార్యకలాపాల విస్తరణ, సహజ ఆవాసాల విచ్ఛిన్నం, మనిషి--వన్యప్రాణి సంఘర్షణ వంటి సమస్యలు సింహాల మనుగడకు సవాళ్లుగా మారుతున్నాయి. అడవులను కాపాడటం, వన్యప్రాణుల సంరక్షణకు ప్రజల భాగస్వామ్యాన్ని పెంచడం ద్వారా ఈ 'రారాజు'ను భవిష్యత్ తరాలకు అందించవచ్చు. గర్జన ఆగకూడదు.. రాజసం తగ్గకూడదు.. అడవికి రారాజైన సింహం తరతరాల పాటు స్వేచ్ఛగా సంచరించాలి

# 17 ఏళ్లకే రూ.3.5 కోట్ల స్కాలర్‌షిప్..

**అమెరికాలో ఫ్రీగా చదువుకునే ఛాన్స్ కొట్టేసిన తమిళనాడు విద్యార్థి**





అమెరికాలో చదువుకోవాలనేది ఇండియాలోని లక్షల మంది డ్రీమ్. అక్కడి యూనివర్సిటీల్లో అడ్మిషన్ దొరకడమే కష్టం. ఒకవేళ దొరికినా బోలెడంత డబ్బు ఖర్చు చేయాల్సి ఉంటుంది. చాలా కుటుంబాలకు ఇది భారం. అలాంటిది తమిళనాడుకు చెందిన 17 ఏళ్ల ఒక విద్యార్థి అమెరికాలోని టాప్ యూనివర్సిటీల్లో ఒకటైన బ్రౌన్ యూనివర్సిటీలో చదువుకునే ఛాన్స్ కొట్టేశాడు. అది కూడా రూ.3.55 కోట్ల స్కాలర్‌షిప్‌తో. అంటే.. నాలుగేళ్ల చదువు పూర్తి ఉచితం. ఈ ఘనత సాధించింది తమిళనాడులోని ఈరోడ్‌కు చెందిన ప్రణవ్ ఇలాంగో అనే 17 ఏళ్ల విద్యార్థి.ప్రణవ్‌కు చాలాకాలంగా విదేశాల్లో.. అందులోనూ అమెరికాలోని ప్రముఖ యూనివర్సిటీల్లో చదువుకోవాలనే కోరిక ఉండేది. దీనికి అనుగుణంగా అతడు 13 ఏళ్ల వయసు నుంచే అక్కడి యూనవర్సిటీల్లో అడ్మిషన్లు, స్కాలర్‌షిప్‌ల ప్రక్రియ గురించి తెలుసుకున్నాడు. ఇదే సమయంలో తన అకడమిక్, టెక్నికల్ స్కిల్స్ కూడా పెంచుకున్నాడు. దీనిలో భాగంగా డెక్స్‌టెరిటీ గ్లోబల్ నేషనల్ స్కాలర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌లో చేరాడు. తన నైపుణ్యాన్ని పెంచుకున్నాడు. మ్యాథమెటిక్స్, పబ్లిక్ హెల్త్‌ను కలపాలన్న తన ఆలోచనకు అనుగుణంగా చదువుకున్నాడు. ఇదే అంశంలో అతడు అమెరికాలోని బ్రౌన్ యూనివర్సిటీలో ప్రతిభ కనిబరిచాడు. రూ.3.55 కోట్ల స్కాలర్‌షిప్ గెలుచుకున్నాడు. 8 ప్రైవేటు యూనివర్సిటీలతో కలిపి ఐవీ లీగ్ యూనివర్సిటీ పేరిట చేపట్టిన కార్యక్రమంలో భాగంగా ప్రణవ్ ఈ స్కాలర్‌షిప్‌నకు ఎంపికయ్యాడు. దీని ప్రకారం ప్రణవ్ నాలుగేళ్లపాటు బ్రౌన్ యూనివర్సిటీలో అండర్‌గ్రాడ్యుయేషన్ కోర్స్ చేసేందుకు అనుమతి, సహకారం లభిస్తుంది. ఈ రూ.3.55 కోట్లను యూనివర్సిటీలో చదువుకు, అక్కడ ఉండటానికి, ఇతర ఖర్చులకు కేటాయిస్తారు. అంటే ట్యూషన్ ఫీజుతోపాటు, నివాస ఖర్చుల కింద నాలుగేళ్లపాటు ఈ మొత్తాన్ని అందిస్తారు. దీంతో అతడు అక్కడ ఎలాంటి ఖర్చూ లేకుండా చదువుకోవచ్చు.

# అమెరికాలో రోడ్డు ప్రమాదం.. తిరుపతికి చెందిన యువకుడు మృతి



అమెరికాలో విషాదం నెలకొంది. ఒహాయో రాష్ట్రంలోని క్లీవ్‌లాండ్‌లో జరిగిన యాక్సిడెంట్‌లో ఏపీకి చెందిన తెలుగు విద్యార్థి మృతిచెందాడు. అతను ప్రయాణిస్తున్న కారును ఓ పికప్ ట్రక్కు ఢీకొట్టడంతో ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది.వివరాల్లోకి వెళ్తే.. తిరుపతి జిల్లా చిట్వేల్ మండలం జెట్టివారిపాలెం గ్రామానికి చెందిన దిలీప్ కుమార్ కొన్నేళ్ల క్రితం ఉన్నత విద్య కోసం అమెరికా వెళ్లాడు. కెంట్ స్టేట్ యూనివర్సిటీలో ఎంఎస్ చేస్తున్నాడు. ఈ క్రమంలో అతను రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో స్వగ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఇదిలా ఉంటే ఈ ప్రమాదంపై న్యూయార్క్‌లోని భారత రాయబార కార్యాలయం స్పందించింది. దిలీప్ కుమార్ అకాల మరణంపై తీవ్ర విచారం వ్యక్తం చేసింది. ఈ క్లిష్ట సమయంలో బాధిత కుటుంబానికి తోడుగా ఉంటామని తెలిపింది. దిలీప్ కుటుంబసభ్యులతో సంప్రదింపులు జరుపుతున్నామని.. మృతదేహాన్ని వీలైనంత తొందరగా స్వగ్రామానికి చేర్చేలా ప్రయత్నాలు చేస్తున్నామని చెప్పారు.

## కారును ఢీకొట్టిన కంటైనర్ లారీ.. ఆరుగురు మృతి



భోపాల్: కంటైనర్ లారీ ఒక కారును ఢీకొట్టింది. ఆ కారులో ప్రయాణించిన ఆరుగురు ఈ ప్రమాదంలో మరణించారు. కంటైనర్ లారీ డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ ప్రమాదంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. (6 ఖఅశ్రీశ్రీవఎ ×అ ాాఎఎఅఎవత్) మధ్యప్రదేశ్‌లోని ధార్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. ఆదివారం మధ్యాహ్నం 1.30 గంటల సమయంలో బద్నావార్ పట్టణానికి సుమారు 4 కిలోమీటర్ల దూరంలోని పంచక్ వాసా సమీపంలో ఉజ్జాయినీ నుంచి వస్తున్న కంటైనర్ లారీ ఒక కారును ఢీకొట్టింది. కాగా, ఈ సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. కారులో ప్రయాణించిన ఆరుగురు అక్కడికక్కడే మరణించినట్లు పోలీస్ అధికారి తెలిపారు. మృతులు గుజరాత్ వాసులని చెప్పారు. కంటైనర్ లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నట్లు వివరించారు. ఈ ప్రమాదంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీస్ అధికారి వెల్లడించారు.

# కాకతీయ విశ్వవిద్యాలయ అభివృద్ధికి రూ.500 కోట్లు ప్రకటించాలి



హనుమకొండ చౌరస్తా : సీఎం రేవంత్‌రెడ్డి ఉస్మానియా విశ్వవిద్యాలయానికి ప్రకటించిన భారీ నిధుల మాదిరిగానే కాకతీయ విశ్వవిద్యాలయ ( ఖుఃన్ఞ్అఖు ఖఅఅజవతీంత్ఎ) అభివృద్ధికి రూ.500 కోట్ల ప్రత్యేక నిధులను అందించాలని కేయూ విశ్రాంత అధ్యాపకుల సంఘం అధ్యక్షుడు ప్రొఫెసర్ ఏ.సదానందం( ఞుఖుఖుఅఖుఎ ) డిమాండ్ చేశారు.కాకతీయ విశ్వవిద్యాలయ స్వర్ణోత్సవాల్లో భాగంగా ఆగస్టు 11న విశ్రాంత అధ్యాపకుల రీయూనియన్ రీయూనియన్ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. విశ్వవిద్యాలయం అంటే కేవలం భవనాలు, రహదారులు కాదు. మానవ వనరులే అసలైన బలమని అన్నారు. పదేళ్లుగా అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది పదవీ విరమణ చేస్తున్నప్పటికీ తగిన స్థాయిలో నియామకాలు జరగకపోవడం ఆందోళనకరంగా ఉందని తెలిపారు. వెంటనే నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. సంఘం కార్యదర్శి రవీందర్, ప్రొఫెసర్లు , బాధ్యులు సి.హెచ్.సమ్మయ్య, జి.వీరన్న, కే.సుధాకర్, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఇండ్ల లబ్ధిదారుల ఎంపికలో తప్పుడు విధానాలకు పాల్పడితే సహించం

**- మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్**



సూర్యపేట : వ్యక్తిగత కక్షలు రాజకీయ కారణాలతో మిగిలిన డబుల్ బెడ్ రూం ఇండ్ల లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియల్లో తప్పుడు విధానాలకు పాల్పడితే చూస్తూ ఊరుకోబోమని మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ వెల్లడించారు. ఆదివారం కోదాడలోని తన నివాసంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.మూడు సంవత్సరాల అనంతరం బాలాజీ నగర్ లోని 560 డబుల్ బెడ్ రూమ్ ఇండ్లకు గాను 548 లబ్ధిదారులకు అధికారులు పట్టాలు పంపిణీ చేయడం అభినందనీయమని అన్నారు. ఇక మిగిలిన లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా చేయాలని అధికారులకు సూచించారు. నిరుపేద కుటుంబాలకు సొంతింటి కల నెరవేరాలని ఆకాంక్షతో తాను శాసనసభ్యుడిగా బాధ్యతలు నిర్వహిస్తున్న సమయంలో పారదర్శకంగా కలెక్టర్ పర్యవేక్షణలో లబ్ధిదారులు ఎంపిక పూర్తి చేశానని తెలిపారు.అయితే అధికారుల నిర్లక్ష్యంతో పలు సాంకేతిక కారణాల దృష్ట్యా పట్టాలు పంపిణీ చేయలేకపోయమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో తాము తక్షణమే మౌలిక వసతులు పూర్తిచేసి ఇళ్ల పట్టాలు పంపిణీ చేయాలని పలుమార్లు ఆందోళన చేశామన్నారు. అండర్ డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా నడుస్తుందని నాణ్యత ప్రమాణాలు పాటించడం లేదని విమర్శించారు. మీడియా సమావేశంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు ఎస్ కే నయీమ్, కౌన్సిలర్ చీమ నరేష్, ఉపేందర్ గౌడ్, అలవాల వెంకట్, ఉపేందర్, కరీముల్లా పాల్గొన్నారు.



## సినిమా ఆఫర్లు లేవని
# ట్రోలింగ్..
### అదిరిపోయే రిప్లై ఇచ్చిన కీర్తి!

నాని హీరోగా శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'ది ప్యారడైజ్' చిత్రంలో కీర్తి సురేష్ ఓ స్పెషల్ సాంగ్ చేస్తుండటంపై కొద్ది రోజులుగా నెట్టింట చర్చ జరుగుతోంది. ఈ నేపథ్యంలో సోషల్ మీడియాలో ఓ మహిళా ఇన్‌స్టాగ్రామ్ యూజర్ కీర్తి సురేష్‌ను విమర్శిస్తూ వీడియో పోస్ట్ చేసింది.

కెరీర్‌లో సరైన పాత్రలు రాకపోవడం వల్లే కీర్తి ఈ స్పెషల్ డ్యాన్స్ నంబర్ చేస్తోందని, అంతేకాకుండా ఇది తెలుగు చిత్రం కాకుండా కన్నడ సినిమా అంటూ తప్పుగా మాట్లాడింది. ఆ వీడియోపై స్పందించిన కీర్తి సురేష్ ఎలాంటి సీరియస్ కామెంట్స్ చేయకుండా తనదైన శైలిలో ఫన్నీగా కౌంటర్ ఇచ్చారు.

"వేరా లెవెల్ పోస్ట్ ఇది! కానీ చిన్న కరెక్షన్. నాని నటిస్తోంది తెలుగు సినిమా, కన్నడ కాదు" అంటూ తమిళంలో సరదాగా రిప్లై ఇచ్చి ట్రోలర్స్‌కు చెక్ పెట్టారు. ప్రస్తుతం ఈ కామెంట్ సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతోంది.

# 'కొరియన్ కనకరాజు' దూకుడు..
## యూఎస్ బాక్సాఫీస్ దగ్గర అదిరిపోయే రెస్పాన్స్!








మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ నటించిన తాజా చిత్రం 'కొరియన్ కనకరాజు' బాక్సాఫీస్ వద్ద జోరు కొనసాగిస్తోంది. గాంధీ మేర్లపాక దర్శకత్వంలో తెరకెక్కిన ఈ కామెడీ థ్రిల్లర్‌కు ప్రేక్షకుల నుంచి పాజిటివ్ టాక్ రావడంతో థియేటర్లలో సందడి కనిపిస్తోంది. ముఖ్యంగా ఓవర్సీస్ మార్కెట్‌లో ఈ సినిమా మంచి వసూళ్లను రాబడుతూ ట్రేడ్ వర్గాల దృష్టిని ఆకర్షిస్తోంది.విడుదలైన తర్వాత సినిమాకు లభిస్తున్న స్పందనతో వరుణ్ తేజ్ అభిమానుల్లోనూ ఉత్సాహం నెలకొంది. ఎంటర్‌టైనింగ్ కథనం, కామెడీ, థ్రిల్లర్ ఎలిమెంట్స్ కలగలిపిన విధానం ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నట్లు తెలుస్తోంది.

ఇదే సమయంలో ఓవర్సీస్‌లోనూ సినిమాకు మంచి ఆదరణ లభించడం చిత్రబృందానికి మరింత బూస్ట్ ఇచ్చింది. ముఖ్యంగా యూఎస్‌ఏ బాక్సాఫీస్ దగ్గర 'కొరియన్ కనకరాజు' తన జోరును కొనసాగిస్తోంది. ఇప్పటికే ఈ చిత్రం 200ఖ డాలర్లకు పైగా వసూళు సాధించినట్లు చిత్రబృందం వెల్లడించింది. దీంతో రానున్న రోజుల్లో కూడా సినిమా ఇదే వేగాన్ని కొనసాగిస్తే ఓవర్సీస్‌లో మరింత మెరుగైన నంబర్స్ నమోదు చేసే అవకాశం ఉందని ట్రేడ్ వర్గాలు భావిస్తున్నాయి. సాధారణంగా ఓవర్సీస్ మార్కెట్‌లో తెలుగు సినిమాలకు ప్రీమియర్ షోలు, తొలి రోజు వసూళ్లు కీలకంగా ఉంటాయి. అయితే 'కొరియన్ కనకరాజు' విషయంలో తొలి స్పందనతో పాటు తర్వాతి షోలకూ ప్రేక్షకుల నుంచి ఆదరణ లభిస్తుండటం సినిమాకు కలిసొచ్చే అంశంగా మారింది. ముఖ్యంగా అమెరికాలోని తెలుగు ప్రేక్షకులతో పాటు కామెడీ, థ్రిల్లర్ జానర్‌ను ఇష్టపడే ఆడియెన్స్ సినిమాను ఎంజాయ్ చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ చిత్రానికి ఓవర్సీస్ విడుదల బాధ్యతలను శ్లోకా ఎంటర్‌టైన్‌మెంట్స్ నిర్వహించింది. ప్రేక్షకులకు అందుబాటులో ఉండేలా పలు లొకేషన్లలో పాస్‌లను కూడా అందుబాటులోకి తీసుకురావడం సినిమాకు మరింతగా రీచ్ పెంచినట్లు తెలుస్తోంది. దీంతో వీకెండ్‌తో పాటు తదుపరి రోజుల్లోనూ థియేటర్లలో ఆక్యుపెన్సీ మెరుగ్గా ఉండే అవకాశం కనిపిస్తోంది. 'కొరియన్ కనకరాజు'లో వరుణ్ తేజ్‌కు జోడీగా రితిక నాయక్ హీరోయిన్‌గా నటించింది. వీరిద్దరి కెమిస్ట్రీతో పాటు సినిమాలోని కామెడీ ట్రాక్ ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నట్లు టాక్ వినిపిస్తోంది.

వరుణ్ తేజ్ కూడా తన గత చిత్రాలకు భిన్నమైన ఎంటర్‌టైనింగ్ పాత్రలో కనిపించడం సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా మారింది.ఇక ఈ చిత్రానికి తమన్ అందించిన సంగీతం మరో ప్లస్ పాయింట్‌గా నిలిచింది. కామెడీ, థ్రిల్, యాక్షన్ అంశాలను మేళవిస్తూ గాంధీ మేర్లపాక రూపొందించిన ఈ చిత్రం తెలుగు రాష్ట్రాల్లోనూ పాజిటివ్ రెస్పాన్స్‌ను సొంతం చేసుకుంటోంది. అదే సమయంలో యూఎస్ మార్కెట్‌లో 200ఖ డాలర్ల మార్క్‌ను దాటడం సినిమా సత్తా చాటుతుంది.

# ట్రైలర్ వచ్చేది ఆరోజే!



రవితేజ నటిస్తున్న ఎమోషనల్ ఫ్యామిలీ డ్రామా 'ఇరుముడి' ఈ నెల 21న ప్రేక్షకుల ముందుకురాబోతున్న విషయం తెలిసిందే. ఆధ్యాత్మిక విశిష్టత కలిగిన టైటిల్ కావడంతో ఈ సినిమా అందరి దృష్టిని ఆకర్షిస్తున్నది. తండ్రీకూతుళ్ల అనుబంధం, ఆధ్యాత్మిక అంశాల కలబోతగా కుటుంబ కథా చిత్రంగా తెరకెక్కిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన 'ఇరుముడి కట్టు' అనే అయ్యప్ప భక్తి ప్రధాన పాటతో పాటు ప్రచార చిత్రాలకు మంచి స్పందన లభించింది. ఈ నెల 12న భీమవరంలో జరిగే వేడుకలో థియేట్రికల్ ట్రైలర్‌ను విడుదల చేయబోతున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ఈ సందర్భంగా శనివారం కొత్త పోస్టర్‌ను రిలీజ్ చేశారు. ఇందులో రవితేజ రెండు పూర్తి భిన్నమైన అవతారాల్లో కనిపిస్తున్నారు. కూతురిని అమితంగా ప్రేమించే తండ్రిగా రవితేజ పాత్ర తీవ్ర భావోద్వేగాలు, సంఘర్షణతో సాగుతుందని..ఇప్పటివరకు ఆయన ఈ తరహా పాత్రలో నటించలేదని మేకర్స్ తెలిపారు. ప్రియాభవానీశంకర్, సాయికుమార్, బేబీ నక్షత్ర తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: జీవీ ప్రకాష్‌కుమార్, నిర్మాతలు: నవీన్ యెర్నేని, వై.రవిశంకర్, కథ, స్క్రీన్‌ప్లే, మాటలు, దర్శకత్వం: శివ నిర్వాణ.

# నానికి జోడీగా?

'లెనిన్'తో కెరీర్‌లో తొలి విజయాన్ని అందుకున్నది పూణే వయ్యారి భాగ్యశ్రీ బోర్సే. దీంతో ఈ అందాలభామకు అద్భుతమైన అవకాశాలు క్యూ కడుతున్నాయి. ప్రస్తుతం కోలీవుడ్ అగ్ర హీరో శివకార్తికేయన్ సరసన 'సెయోన్' సినిమాలో నటిస్తూ భాగ్యశ్రీ బోర్సే బిజీగా ఉన్నది. తాజా సమాచారం ప్రకారం టాలీవుడ్ అగ్ర హీరో నాని హీరోగా సుజీత్ దర్శకత్వంలో తెరకెక్కనున్న 'బ్లడీ రోమియో' చిత్రంలోనూ కథానాయికగా భాగ్యశ్రీ బోర్సే పేరునే పరిశీలిస్తున్నట్టు ఇండస్ట్రీ వర్గాల్లో ప్రచారం జరుగుతున్నది. సంప్రదింపులు కూడా జరిగాయని, త్వరలోనే దీనిపై పూర్తి క్లారిటీ వచ్చే అవకాశం ఉందని తెలుస్తున్నది. మలయాళ అగ్ర నటుడు పృథ్వీరాజ్ సుకుమారన్ కూడా ఈ సినిమాలో కీలక పాత్ర పోషించనున్నారు. అక్టోబర్ నుంచి చిత్రీకరణ మొదలు కానున్న ఈ చిత్రాన్ని నిహారిక ఎంటర్‌టైన్‌మెంట్స్ నిర్మిస్తున్న విషయం తెలిసిందే.



# సామాన్యుడి కథ



సచిన్‌రామ్ ప్రతాప్, హాసిని దేవరకొండ జంటగా నటిస్తున్న చిత్రం 'శివగాడి జిందగీ'. వినయ్ రెడ్డి చందుపట్ల దర్శకుడు. ఐశ్వర్య సినీ క్రియేషన్స్ పతాకంపై సింధుసూర్య నిర్మిస్తున్నారు. ఈ సినిమా టైటిల్‌తో పాటు ఫస్ట్‌లుక్‌ని ప్రముఖ నిర్మాత డి.సురేష్‌బాబు ఆవిష్కరించారు. మన సమాజంలోని సగటు మనిషి కథ ఇదని, జీవితం తాలూకు ప్రేమ, స్నేహం, కష్టాలను సహజంగా చూపించే ప్రయత్నం చేశామని..వినోదానికి కూడా పెద్దపీట వేశామని దర్శకుడు వినయ్ రెడ్డి తెలిపారు. ఓ సామాన్యుడి కథగా ప్రతీ ఒక్కరిని ఆకట్టుకుంటుందని, త్వరలో విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నామని నిర్మాత సింధు సూర్య పేర్కొన్నారు. ఈ చిత్రానికి కెమెరా: జేపీ రెడ్డి, సంగీతం: సాయి, రచన–సాహిత్యం–దర్శకత్వం: వినయ్ రెడ్డి చందుపట్ల.

## కంటెంట్ బాగుంటే విజయం ఖాయం



కోలీవుడ్ అగ్ర దర్శకుడు లోకేశ్ కనకరాజ్ హీరోగా పరిచయంమైన రస్టిక్ మాస్ ఎంటర్‌టైనర్ 'డిసి'. వామికా గబ్బి, సంజనా కృష్ణమూర్తి కథానాయికలు. అరుణ్ మాథేశ్వరన్ దర్శకత్వంలో సన్ పిక్చర్స్ నిర్మించిన ఈ చిత్రం ఇటీవల విడుదలై థియేటర్లలో విజయవంతంగా ప్రదర్శితమవుతున్నది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో మేకర్స్ ప్రెస్‌మీట్ నిర్వహించారు. 'ఏషియన్ సునీల్, దిల్‌రాజులతో కలిసి ఈ సినిమాను డిస్ట్రిబ్యూట్ చేశాం. రెండు తెలుగు రాష్ట్రాల్లో సినిమాకు అద్భుతమైన స్పందన వస్తున్నది. లోకేష్ కనకరాజ్ పర్ఫార్మెన్స్‌కు ప్రశంసలొస్తున్నాయి. హై టెక్నికల్ వాల్యూస్‌తో ఈ సినిమా తెరకెక్కింది. కంటెంట్ బాగుంటే విజయం ఖాయమని ఈ సినిమా నిరూపించింది' అని నిర్మాత సురేశ్‌బాబు తెలిపారు. ఈ సినిమా విజయం పట్ల సునీల్ నారంగ్, శిరీష్‌రెడ్డి ఆనందం వ్యక్తం చేశారు.

# హింసాత్మక మాఫియా ప్రపంచం 'టాక్సిక్'



కన్నడ అగ్రనటుడు 'కేజీఎఫ్'ఫేం యశ్ కథానాయకుడిగా రూపొందిన పాన్ ఇండియా యాక్షన్ ఎంటర్‌టైనర్ 'టాక్సిక్'. గీతూ మోహన్‌దాస్ దర్శకత్వం వహించిన ఈచిత్రం కేవీఎన్ ప్రొడక్షన్స్, మాన్‌స్టర్ మైండ్ క్రియేషన్స్ పతాకాలపై నిర్మితమైన విషయం తెలిసిందే. ఈ నెల 26న ప్రపంచవ్యాప్తంగా సినిమా విడుదల కానున్నది. ఈ సందర్భంగా శనివారం ఈ సినిమా ట్రైలర్‌ని బెంగళూరులో ఘనంగా విడుదల చేశారు. చిత్ర బృంద మంతా కార్యక్రమంలో పాల్గొన్నారు. ట్రైలర్ ఆద్యంతం ఆధిపత్య పోరుతో కూడిన హింసాత్మక మాఫియా ప్రపంచాన్ని ఆవిష్కరించింది. అంతర్లీనంగా ఓ బలమైన కథ కూడా ఉన్నట్టు అర్థమవుతున్నది. 'ముసుగేసుకొని మొహం మీదున్న దుఖాన్ని దాచిపెట్టొచ్చు.. నుదుటిపై రాసిన విషాదాన్ని దాచలేం..', 'అమ్మాయిలకు అందమే అసలైన సింగారం.. ఆ అందాన్ని ఆయుధంగా వాడితే ఎలా బంగారం..' లాంటి డైలాగులు సినిమాపై ఆసక్తిని పెంచాయి. ఇందులో యశ్ పాత్ర పేరు 'రాయ' అని నయనతార డైలాగ్ ద్వారా అర్థమైంది. ట్రైలర్‌లో కథానాయికలు కైరా అద్వానీ, హ్యూమా ఖురేషి, నయనతార, రుక్మిణి వసంత్ సైతం నెగెటివ్ షేడ్స్‌లో కనిపిస్తున్నారు. ఆర్టిస్టుల పెర్ఫార్మెన్స్, కెమెరా యాంగిల్స్, సినేరియా.. ఇలా అంతా హాలీవుడ్ సినిమాలను తలపిస్తున్నాయి. ఇందులో యశ్ తండ్రీకొడుకులుగా ద్విపాత్రాభినయం చేసినట్టు ట్రైలర్ చూస్తే అవగతమైంది. ట్రైలర్‌ని బట్టి ఇది తండ్రీకొడుకుల భీకరపోరు అని చెప్పొచ్చు. తగలపడిపోతున్న రగులరాట్నం ఏదో భయంకరమైన కథ చెబుతున్నట్టుంది. కొడుకు పాత్ర క్రూరంగా కనిపిస్తున్నది. 4 నిమిషాల 38 సెకన్ల నిడివి గల ఈ ట్రైలర్‌లో 3 నిమిషాలు పూర్తవ్వగానే కొడుకు పాత్ర రివీల్ అయింది. 'శాంతి వల్ల అంతా బావుంటే.. శతాబ్దాలుగా యుద్ధాలెందుకు జరిగేవిరా..?' అంటూ కొడుకు యశ్ చెప్పే డైలాగ్ కథపై ఆసక్తిని రేకెత్తించింది. నాగరికత గురించి మాట్లాడుతూనే అనాగరికతను ట్రైలర్‌లో బలంగానే దర్శకురాలు గీతూ మోహన్‌దాస్ చూపించారు. మొత్తంగా పరిధులు లేని హైస్టైలిష్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'టాక్సిక్' అని ట్రైలర్ చెప్పింది.

# విద్యార్థుల భవిష్యత్ కంటే మంత్రి పదవులు ముఖ్యం కాదు

**- జెన్-జీ గురించి ధర్మేంద్ర ప్రధాన్ ఏమన్నారు**



అమరావతి (ప్రశ్న న్యూస్) నీట్ పేపర్ లీక్ వివాదంపై విద్యార్థుల ఆందోళనల నేపథ్యంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి పదవికి రాజీనామా చేసిన బీజేపీ సీనియర్ నేత, సంబల్‌పూర్ ఎంపీ ధర్మేంద్ర ప్రధాన్ తొలిసారిగా ఆ అంశంపై స్పందించారు. విద్యార్థులను (జెన్-జీ) తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు జరిగాయని, అందుకే తాను రాజీనామా చేశానని వెల్లడించారు. జులై 25న రాజీనామా చేసిన సరిగ్గా రెండు వారాల తర్వాత, భువనేశ్వర్‌లోని జీఎం యూనివర్సిటీలో విద్యార్థులు, ఉపాధ్యాయులను ఉద్దేశించి మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. “జెన్-జీ మన పిల్లలు. కొంతమంది వారిని తప్పుదోవ పట్టించాలని చూశారు. నాకు వ్యక్తిగతంగా ఎలాంటి సమస్యలు లేవు. పదవి నాకు ముఖ్యం కాదు. అందుకే ప్రధాని నరేంద్ర మోదీని కలిసి నా రాజీనామాను ప్రతిపాదించాను” అని ప్రధాన్ వివరించారు. భారతదేశంలో ప్రతి ఏటా రెండు కోట్ల మంది పిల్లలు పుడుతున్నారని, గడిచిన పదేళ్లలో 20 కోట్ల మంది జన్మించారని, వారి ఆకాంక్షలే దేశాన్ని ‘విశ్వగురువు’గా నిలబెడతాయని ఆయన అన్నారు.మరోవైపు తన ఒడిశా పర్యటన సందర్భంగా బీజేడీ కార్యకర్తలు చేపట్టిన నిరసనలపై కూడా ప్రధాన్ తీవ్రంగా స్పందించారు. ఎయిర్‌పోర్ట్ వద్ద ‘ధర్మేంద్ర ప్రధాన్ గో బ్యాక్’ అంటూ బీజేడీ యువజన, విద్యార్థి విభాగం కార్యకర్తలు చేసిన నిరసనలను ప్రస్తావిస్తూ మాజీ ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్‌పై విమర్శలు గుప్పించారు. “నేనొక రైతు కొడుకుని. మీరు నన్ను వెనక్కి పొమ్మన్నా, మళ్లీ వస్తాను. నవీన్ బాబు నన్ను ఒడిశా ప్రజలకు అవమానకరమని, చెడ్డవాడినని అంటున్నారు. ఒడిశా ప్రజలు సిగ్గుతో తలదించుకునే పని నేనెప్పుడైనా చేశానా?” అని సభను ప్రశ్నించగా, ‘లేదు’ అంటూ పెద్ద ఎత్తున స్పందన వచ్చింది. రాష్ట్ర ప్రతిష్ఠను దెబ్బతీసే పని తాను ఎప్పటికీ చేయనని ఆయన స్పష్టం చేశారు. ప్రధాన్ ఈ వ్యాఖ్యలు చేసిన వేదికపై బీజేడీ ఎమ్మెల్యే ప్రసన్న ఆచార్య కూడా ఉన్నారు. బీజేడీ నిరసనల నేపథ్యంలో తాను రావాలా? వద్దా? అని ప్రసన్న ఆచార్యను సంప్రదించానని, ఆయన రమ్మని చెప్పడంతోనే వచ్చానని ప్రధాన్ పేర్కొన్నారు.ధర్మేంద్ర ప్రధాన్ విమర్శలపై బీజేడీ సంబల్‌పూర్ జిల్లా అధ్యక్షుడు రోహిత్ పూజారి బదులిచ్చారు. “ప్రధాన్‌ను ఎవరూ అప్రతిష్ఠపాలు చేయలేదు. ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద శాంతియుతంగా ఆందోళన చేస్తున్న విద్యార్థులపై లాఠీఛార్జ్, టియర్ గ్యాస్ ప్రయోగించడం ద్వారా ఆయన పార్టీ, ప్రభుత్వమే ఆయన పరువు తీశాయి. పోలీసుల దౌర్జన్యాలకు నవీన్ పట్నాయక్‌ను నిందించడం ఎంతవరకు సమంజసం?” అని పూజారి ప్రశ్నించారు. ఇదిలా ఉంటే.. ప్రధాన్ పర్యటన నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు చర్యగా సుమారు 30 మంది బీజేడీ కార్యకర్తలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

# భారత ఫేవరెట్ రమ్ బ్రాండ్ కు గడ్డుకాలం!

**- అనుమతి లేని ఫ్లేవర్లు వాడారని ఆరోపణలు**



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) భారతదేశంలో దశాబ్దాలుగా అత్యంత ప్రజాదరణ పొందిన డార్క్ రమ్ బ్రాండ్ ‘ఓల్డ్ మాంక్’ తీవ్ర వివాదంలో చిక్కుకుంది. నాణ్యతా ప్రమాణాల ఉల్లంఘన, లేబుళ్లపై తప్పుదారి పట్టించే సమాచారం వంటి కారణాలతో ఈ బ్రాండ్‌కు చెందిన కొన్ని వేరియంట్ల అమ్మకాలను ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియానిషేధించింది. ఈ వార్త ఓల్డ్ మంక్ అభిమానులకు, మద్యం రంగ నిపుణులకు తీవ్ర దిగ్భ్రాంతి కలిగించింది. మహారాష్ట్రలోని ఒక డిస్టిలరీలో తయారైన ఓల్డ్ మాంక్ మూడు వేరియంట్లలో అనుమతి లేని కృత్రిమ ఫ్లేవర్లను గుర్తించినట్లు ఎఫ్ఎస్ఎస్ఏఐ తన నివేదికలో పేర్కొంది. సహజసిద్ధమైన రుచి, వాసనను అనుకరించేలా వీటిని వాడటం వినియోగదారులను మోసం చేయడమేనని స్పష్టం చేసింది. ఓల్డ్ మంక్‌తో పాటు మెక్‌డొవెల్స్, రాయల్ ఛాలెంజ్, యాంటిక్విటీ బ్లూ విస్కీలకు చెందిన కొన్ని బ్యాచ్‌లపై కూడా ఎఫ్ఎస్ఎస్ఏఐ చర్యలు తీసుకుంది.దీంతో పాటు, ఓల్డ్ మాంక్ బాటిళ్లపై ఉన్న “7 ఇయర్స్ ఓల్డ్ బ్లెండెడ్” అనే వాదన కూడా తప్పుదారి పట్టించేలా ఉందని ఎఫ్ఎస్ఎస్ఏఐ తెలిపింది. 2018 ఆహార భద్రత, ప్రమాణాల (ఆల్కహాలిక్ బెవరేజెస్) నిబంధనల ప్రకారం, ఏదైనా మద్యం మిశ్రమంలో అతి తక్కువ వయసు ఉన్న స్పిరిట్ వయసునే లేబుల్‌పై ప్రకటించాలి. అయితే, ఓల్డ్ మాంక్ రమ్‌లో ఎక్కువ భాగం వయసు నిర్ధారణ లేని సాధారణ స్పిరిట్‌తో తయారుచేసి, కేవలం 5 శాతం కన్నా తక్కువ మాత్రమే ఏళ్ల తరబడి నిల్వ ఉంచిన రమ్‌ను కలుపుతున్నారని ఎఫ్ఎస్ఎస్ఏఐ ఆక్షేపించింది.

# బోనాల వేడుకల్లో శ్రీ నల్లపోచమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు

**- అమ్మవారి దయతో అందరూ సుఖసంతోషాలతో ఉండాలి: పుండరీ చారి**



**హైదరాబాద్(ప్రశ్న న్యూస్)** అంబర్‌పేట డివిజన్ పటేల్‌నగర్‌లోని శ్రీ నల్లపోచమ్మ అమ్మవారి ఆలయంలో బోనాల వేడుక సందర్భంగా ఆదివారం ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ జర్నలిస్ట్ జూలూరు పుండరీ చారి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో మానవతా విలువలు మరింతగా పెంపొందాలని, డ్రగ్స్ రహిత భారతదేశ నిర్మాణం జరగాలని శ్రీ నల్లపోచమ్మ అమ్మవారిని మనసారా ప్రార్థించినట్లు తెలిపారు. దేశవ్యాప్తంగా సమృద్ధిగా వర్షాలు కురిసి అన్ని ప్రాజెక్టులు, చెరువులు నిండాలని, రైతులు సిరిసంపదలతో తులతూగాలని ఆకాంక్షించారు.విలువలతో కూడిన సమాజ నిర్మాణం జరగాలని, శాస్త్ర సాంకేతిక రంగాల్లో భారత్ ప్రపంచంలో అగ్రస్థానంలో నిలవాలని కోరుకున్నారు. భారతీయ సంస్కృతి, సాంప్రదాయాలు, ఆధ్యాత్మికత ప్రపంచానికి మార్గదర్శకంగా నిలవాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. శ్రీ నల్లపోచమ్మ అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో పోలోజు చంద్రకళ, పోలోజు ప్రశాంత్, పోలోజు స్వరూపారాణి, పోలోజు వరుణ్, పోలోజు వకలేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

# విశాఖపట్నంలో మెరిసిన చిన్నారుల ప్రతిభ

**- వేదిక్ మ్యాథ్స్, అబాకస్, కూచిపూడి ప్రదర్శనలతో అలరించిన విద్యార్థులు**



**విశాఖపట్నం(ప్రశ్న న్యూస్)** విశాఖపట్నంలోని కళాభారతి ఆడిటోరియంలో శనివారం శ్రీ సాయి రాజేశ్వరి ఎడ్యుకేషనల్ అకాడమీ విద్యార్థులు తమ ప్రతిభను ఘనంగా చాటుకున్నారు. శ్రీ సాయి రాజేశ్వరి ఎడ్యుకేషనల్ అకాడమీ, డ్రీమ్ స్టూడియో ఆధ్వర్యంలో, భారత్ ఆర్ట్స్ అకాడమీ నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో విద్యార్థులు వివిధ కళా, విద్యా ప్రదర్శనలతో ప్రేక్షకులను ఆకట్టుకున్నారు.అకాడమీ వ్యవస్థాపకురాలు డాక్టర్ రాజా రాజేశ్వరి మార్గదర్శకత్వం, ప్రోత్సాహంతో విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా కార్యక్రమంలో పాల్గొన్నారు. చిన్నారుల



ప్రతిభను చూసి తల్లిదండ్రులు, నిర్వాహకులు హర్షం వ్యక్తం చేశారు.

## వేదిక్ మ్యాథ్స్‌తో అబ్బురపరిచిన విద్యార్థులు

వేదిక్ మ్యాథ్స్ విభాగంలో పూర్వి, సాయి, శిశిర, తపస్విని తమ ప్రతిభను ప్రదర్శించి ప్రశంసలు అందుకున్నారు. క్లిష్టమైన గణిత అంశాలను సులభంగా, వేగంగా పరిష్కరిస్తూ తమలోని ప్రతిభను చాటుకున్నారు. అబాకస్‌లో అదరగొట్టిన చిన్నారులు అబాకస్ విభాగంలో పునిత్, దేవాన్ష్, గహన్, తన్విష్ చక్కటి ప్రదర్శనతో ఆకట్టుకున్నారు. వేగంగా గణనలు చేస్తూ ప్రేక్షకుల నుంచి అభినందనలు అందుకున్నారు.కూచిపూడి నృత్యంతో ఆకట్టుకున్న తన్వికూచిపూడి నృత్య విభాగంలో తన్వి అద్భుతమైన నృత్య ప్రదర్శనతో ప్రేక్షకులను అలరించింది. సంప్రదాయ నృత్యంలోని



హావభావాలు, అభినయంతో ఆకట్టుకుని ప్రత్యేక ప్రశంసలు అందుకుంది.తల్లిదండ్రులు, నిర్వాహకుల అభినందనలువిద్యార్థుల విజయవంతమైన ప్రదర్శనకు తల్లిదండ్రులు లక్ష్మి, సింధు, దివ్య, విజయ తదితరులు అభినందనలు తెలిపారు. కార్యక్రమానికి డ్రీమ్ స్టూడియో అందించిన సహకారానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అలాగే దుర్గాప్రసాద్, రమా అందించిన ప్రోత్సాహం విద్యార్థులకు ఎంతో ఉత్సాహాన్ని కలిగించిందని నిర్వాహకులు పేర్కొన్నారు.చిన్నారులు వేదిక్ మ్యాథ్స్, అబాకస్, కూచిపూడి వంటి విభిన్న రంగాల్లో ప్రతిభను ప్రదర్శించడం పట్ల తల్లిదండ్రులు, అకాడమీ నిర్వాహకులు ఆనందం వ్యక్తం చేశారు. విద్యార్థుల ప్రతిభను వెలికితీసేందుకు ఇలాంటి కార్యక్రమాలు మరింతగా నిర్వహించాలని ఆకాంక్షించారు.

# శస్త్రచికిత్సలో ‘రోబో’.. కొత్త అధ్యాయం!

- క్లిష్టమైన ఆపరేషన్లకూ సులువైన మార్గం
- రోబోటిక్ శస్త్రచికిత్సలతో నిపుణులకు.. రోగులకు ప్రయోజనాలు
- ఐఎంఏ గుంటూరు శాఖ సీపీఈ కార్యక్రమంలో వైద్య నిపుణులు



**గుంటూరు(ప్రశ్న న్యూస్)** వైద్యరంగంలో రోబోటిక్ శస్త్రచికిత్సలు కొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టాయని హైదరాబాద్ యశోద ఆసుపత్రుల శస్త్రచికిత్స నిపుణుడు డా. వై. శ్రీమన్నారాయణ అన్నారు. ఆర్థికంగా కొంత భారమైనప్పటికీ.. శస్త్రచికిత్స నిపుణులకు, రోగులకు అనేక ప్రయోజనాలు అందిస్తున్నాయని తెలిపారు. క్లిష్టమైన శస్త్రచికిత్సలను సైతం రోబో సహకారంతో మరింత సులువుగా, కచ్చితత్వంతో నిర్వహించే అవకాశం ఉందన్నారు. ఐఎంఏ గుంటూరు శాఖ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం జీఎంఏ హాలులో నిర్వహించిన నిరంతర వైద్య విద్యా కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. ఐఎంఏ గుంటూరు శాఖ అధ్యక్షుడు డా. టి. సేవకుమార్ అధ్యక్షత వహించారు.

## క్లిష్ట ఆపరేషన్లకు రోబో సహకారం

డా. శ్రీమన్నారాయణ మాట్లాడుతూ.. సంప్రదాయ శస్త్రచికిత్సలతో పోలిస్తే రోబోటిక్ విధానంలో అత్యంత క్లిష్టమైన ప్రాంతాల్లోనూ కచ్చితత్వంతో పని చేసే అవకాశం ఉంటుందన్నారు. ఆధునిక సాంకేతికతను వైద్య నైపుణ్యంతో అనుసంధానించడం ద్వారా శస్త్రచికిత్సల సామర్థ్యాన్ని మరింత పెంచవచ్చని తెలిపారు.

## తొలిదశలో గుర్తిస్తే క్యాన్సర్‌కు చికిత్స

క్యాన్సర్ శస్త్రచికిత్స నిపుణుడు డా. వై. యుగంధర్‌రెడ్డి మాట్లాడుతూ.. క్యాన్సర్ చికిత్సలో ప్రస్తుతం అనేక ఆధునిక విధానాలు అందుబాటులోకి వచ్చాయని తెలిపారు. క్యాన్సర్‌ను తొలిదశలో గుర్తిస్తే పూర్తిగా నయం చేసే అవకాశాలు మెరుగ్గా ఉంటాయని పేర్కొన్నారు.కొన్ని రకాల క్యాన్సర్లకు శస్త్రచికిత్స, రేడియేషన్, మందులతో పాటు హార్మోన్ థెరపీ, ఇమ్యూనోథెరపీ వంటి ఆధునిక చికిత్సా విధానాలు మంచి ఫలితాలను ఇస్తున్నాయని వివరించారు.

## మూత్రపిండాలు.. ప్రోస్టేట్‌కు ప్రయోజనం

యశోద ఆసుపత్రుల యూరాలజిస్ట్ డా. ఆమంచర్ల కౌశిక్ మాట్లాడుతూ.. యూరినరీ బ్లాడర్, కిడ్నీ, ప్రోస్టేట్ శస్త్రచికిత్సల్లో రోబోటిక్ విధానంతో అనేక ప్రయోజనాలు ఉన్నాయని తెలిపారు. సాధారణంగా శస్త్రచికిత్స నిపుణులు చేరుకోవడం కష్టమైన శరీర భాగాల్లోకి సైతం రోబోటిక్ పరికరాలు చేరి, వైద్యుల నియంత్రణలో కచ్చితమైన శస్త్రచికిత్స నిర్వహించేందుకు వీలు కల్పిస్తాయని చెప్పారు.ఆధునిక సాంకేతికతతో శస్త్రచికిత్సలకు పట్టే సమయం తగ్గడంతో పాటు.. వైద్యుల నైపుణ్యాన్ని మరింత సమర్థంగా వినియోగించుకునే అవకాశం ఏర్పడుతోందన్నారు.

## నిపుణులు రావడం అభినందనీయం

సభాధ్యక్షుడు డా. టి. సేవకుమార్ మాట్లాడుతూ.. హైదరాబాద్ నుంచి వైద్య నిపుణులు గుంటూరుకు వచ్చి ఐఎంఏ నిర్వహించిన వైద్య విద్యా కార్యక్రమంలో పాల్గొనడం అభినందనీయమన్నారు. ఇటువంటి కార్యక్రమాల ద్వారా వైద్యులు ఆధునిక చికిత్సా విధానాలపై అవగాహన పెంచుకోవచ్చని తెలిపారు.కార్యక్రమం అనంతరం వక్తలకు ప్రముఖ సర్జన్ డా. మద్దినేని గోపాలకృష్ణ ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఐఎంఏ ఉపాధ్యక్షుడు డా. మోపర్తి శివప్రసాద్, సంయుక్త కార్యదర్శి డా. సీహెచ్ శ్రీనివాసరెడ్డి, పలువురు ఐఎంఏ వైద్యులు పాల్గొన్నారు.

# బందెల దయాకర్‌కు ఘన సన్మానం

**- మానవ హక్కుల సంఘం జాతీయ అధ్యక్షుడిగా నియామకంపై ప్రెస్‌క్లబ్ సభ్యుల అభినందనలు**



మంగళగిరి(ప్రశ్న న్యూస్) మానవ హక్కుల సంఘం జాతీయ అధ్యక్షుడిగా నియమితులైన మంగళగిరి ప్రెస్‌క్లబ్ ప్రధాన కార్యదర్శి, మహా న్యూస్ మంగళగిరి నియోజకవర్గ రిపోర్టర్ బందెల దయాకర్‌ను ప్రెస్‌క్లబ్ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా శాలువా కప్పి, పూలమాల వేసి, పూలమొక్క అందజేసి అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ.. బందెల దయాకర్ మానవ హక్కుల సంఘం జాతీయ అధ్యక్షుడిగా నియమితులు కావడం అభినందనీయమన్నారు. జర్నలిస్టుగా ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంతో పాటు, కొత్త బాధ్యతల్లో పేదలు, బలహీన వర్గాల హక్కుల పరిరక్షణకు కృషి చేయాలని ఆకాంక్షించారు. జాతీయ స్థాయిలో బాధ్యతలను సమర్థంగా నిర్వహిస్తూ మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని శుభాకాంక్షలు తెలిపారు.కార్యక్రమంలో మంగళగిరి ప్రెస్‌క్లబ్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు ఈపూరి రాజారత్నం, కోశాధికారి బత్తుల సాంబశివరావు (సాంబ), ఉపాధ్యక్షులు షేక్ సుభాని, బాపనపల్లి శ్రీనివాసరావు, గౌరవ సలహాదారు శిరందాసు నాగార్జున, సహాయ కార్యదర్శులు చదలవాడ సాయి చంద్, నాయుడు నాగరాజు, కార్యదర్శులు మెడకాయల మస్తాన్‌రావు, దొప్పలపూడి రామకుమార్, కార్యవర్గ సభ్యులు శిరందాసు భాస్కర్, చిన్ని, సభ్యులు మధు తదితరులు పాల్గొన్నారు.

# చివరి గూడెం వరకు అభివృద్ధే లక్ష్యం

- చంద్రబాబు నాయకత్వంలోనే ఆదివాసీల అభ్యున్నతి
- గిరిజనుల హక్కులు, సంస్కృతి పరిరక్షణకు ప్రాధాన్యం
- ప్రపంచ ఆదివాసీ దినోత్సవంలో : ఎంపీ కేశినేని చిన్ని



**విజయవాడ(ప్రశ్న న్యూస్)** కొండలు, అడవుల్లోని మారుమూల గిరిజన గూడేల నుంచి చివరి కుటుంబం వరకు అభివృద్ధి ఫలాలు చేరినప్పుడే నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుందని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) అన్నారు. ఆదివాసీ, గిరిజనుల సంక్షేమం, అభివృద్ధి, హక్కుల పరిరక్షణకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నారని పేర్కొన్నారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా విజయవాడలోని అంబేద్కర్ కళా వేదికలో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.

ఆదివాసీలు కేవలం అడవుల్లో నివసించే ప్రజలు కాదని.. నేల, నీరు, ప్రకృతితో వేల ఏళ్లుగా అనుబంధం కలిగిన మూలవాసుల వారసులని చిన్ని అన్నారు. వారి చరిత్ర భారత చరిత్రకు ముందుమాట వంటిదని పేర్కొన్నారు. ప్రకృతిని జయించకుండా దానితో సహజీవనం చేస్తూ సాగించిన గొప్ప సంస్కృతి ఆదివాసీలదని కొనియాడారు.

## గిరిజన మహిళ రాష్ట్రపతి కావడం గర్వకారణం

ద్రౌపది ముర్మును భారత రాష్ట్రపతిగా ఎన్నుకోవడం ద్వారా ఎన్డీఏ ప్రభుత్వం గిరిజన సమాజానికి అత్యున్నత గౌరవం కల్పించిందని చిన్ని తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం ఆదివాసీల పట్ల చూపుతున్న గౌరవానికి ఇది నిదర్శనమన్నారు. కేంద్రం నుంచి నిధులు, పథకాలు అందిస్తే.. రాష్ట్ర ప్రభుత్వం వాటిని క్షేత్రస్థాయిలో సమర్థంగా అమలు చేస్తోందని చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో గిరిజన ప్రాంతాల్లో అభివృద్ధి వేగం పుంజుకుంటోందన్నారు.

## అరకు కాఫీకి అంతర్జాతీయ గుర్తింపు

గిరిజన రైతులు పండిస్తున్న అరకు కాఫీకి ప్రపంచస్థాయి గుర్తింపు తీసుకురావడానికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని చిన్ని అన్నారు. గిరిజన ఉత్పత్తులకు దేశ, విదేశీ మార్కెట్లలో మంచి ధర, గుర్తింపు లభించేలా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.అరకు కాఫీని కేంద్ర మంత్రులు, ఎంపీలు, జాతీయ, అంతర్జాతీయ ప్రముఖులకు పరిచయం చేయడం ద్వారా గిరిజన రైతుల శ్రమకు తగిన మార్కెట్ కల్పించే ప్రయత్నం జరుగుతోందన్నారు.

## థింసాకు ప్రపంచ వేదికపై గుర్తింపు

భోగాపురంలోని అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయంలో సుమారు 13 వేల మంది గిరిజన మహిళల థింసా నృత్య ప్రదర్శనకు ప్రపంచస్థాయి గుర్తింపు లభించేలా ప్రోత్సహిస్తున్నామని చిన్ని తెలిపారు. ఆదివాసీల కళలు, సంస్కృతి, సంప్రదాయాలను అంతర్జాతీయ వేదికపైకి తీసుకెళ్లడమే లక్ష్యమన్నారు.

## గిరిజన యువతకు ఉద్యోగావకాశాలు

విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఆధ్వర్యంలో డీఎస్సీ నియామకాలు చేపట్టి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నామని చెప్పారు. రిజర్వేషన్ నిబంధనల ప్రకారం ఆదివాసీ, గిరిజన యువతకు కూడా ఉద్యోగ అవకాశాలు లభిస్తున్నాయని తెలిపారు.గిరిజన విద్యకు 29.28 శాతం నిధులు కేటాయించడం ద్వారా ప్రభుత్వం విద్యకు ప్రాధాన్యం ఇస్తోందన్నారు. విద్యే గిరిజన సమాజ అభివృద్ధికి అత్యంత శక్తివంతమైన సాధనమని పేర్కొన్నారు.

## తిరువూరు గిరిజన ప్రాంతాలకు నిధులు

విజయవాడ పార్లమెంట్ పరిధిలోని తిరువూరు నియోజకవర్గ గిరిజన ప్రాంతాల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కోరిన వెంటనే ముఖ్యమంత్రి చంద్రబాబు స్పందించారని చిన్ని తెలిపారు. అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయడం గిరిజనుల పట్ల ముఖ్యమంత్రికి ఉన్న ప్రత్యేక శ్రద్ధకు నిదర్శనమన్నారు.?

## అభివృద్ధి అంటే.. గూడెం గడపకు చేరాలి

“నగరాల అభివృద్ధి మాత్రమే అభివృద్ధి కాదు. కొండల్లో, అడవుల్లో, మారుమూల గిరిజన గూడేల్లో నివసించే చివరి కుటుంబం వరకు అభివృద్ధి చేరినప్పుడే అది నిజమైన అభివృద్ధి” అని చిన్ని అన్నారు.గిరిజనుల సంస్కృతి, సంప్రదాయాలు, హక్కులను పరిరక్షిస్తూ విద్య, వైద్యం, రహదారులు, తాగునీరు, ఉపాధి, మౌలిక వసతులు వారి గడపకు చేర్చడమే స్వర్ణాంధ్ర నిర్మాణంలో కీలకమని తెలిపారు.చంద్రబాబు నాయకత్వంలో ఆదివాసీ, గిరిజన సమాజం అభివృద్ధి, ఆత్మగౌరవం, ఆత్మనిర్భరత వైపు మరింత ముందుకు సాగుతుందని ఆకాంక్షించారు. ఆదివాసీ అభ్యున్నతి ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదని, స్వర్ణాంధ్ర నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

# ప్రైవేట్ హాస్పిటల్స్ వైద్యం..
# సేవా రంగమా.? వ్యాపార రంగమా.?



**- ల్యాబ్ రిఫరల్స్ నుంచి మెడిసిన్ కమిషన్ల వరకు... పేషెంట్ జేబుకే ఎందుకు బరువు.?**
**- నాకు నచ్చిన ల్యాబ్‌లో పరీక్ష చేయించుకుంటా అంటే ఎందుకు అభ్యంతరాలు.?**
**- తక్కువ ధరలో మందులు తీసుకుంటా అంటే ఎందుకు ఒప్పుకోరు.?**

(చిన్న -- ప్రశ్న న్యూస్ మేడ్చల్ ప్రతినిధి)






వైద్యం అంటే ప్రాణాలను కాపాడే పవిత్రమైన వృత్తి. డాక్టర్ అంటే రోగికి దేవుడితో సమానం అనే నమ్మకం మన సమాజంలో ఉంది. అయితే కొన్ని చోట్ల వైద్య సేవల చుట్టూ వినిపిస్తున్న ఆరోపణలు, ఫిర్యాదులు, అనుమానాలు మాత్రం ఆ నమ్మకాన్నే ప్రశ్నించేలా చేస్తున్నాయి.అందరూ డాక్టర్లు ఒకేలా కాదు. నిజాయితీగా సేవ చేస్తున్న వేలాది మంది వైద్యులకు ఈ ప్రశ్నలు వర్తించవు. కానీ కొందరి వ్యవహారాలపై వస్తున్న ఆరోపణలు నిజమైతే వాటిపై పారదర్శకమైన విచారణ జరగాల్సిందే.

### ల్యాబ్ రిఫరల్.. పేషెంట్‌కు ఎంపిక ఉందా.?

ఒక రోగికి రక్తపరీక్ష, స్కానింగ్, ఇతర వైద్య పరీక్షలు అవసరమైతే డాక్టర్ రాస్తారు. పరీక్ష అవసరమైతే చేయించుకోవడం తప్పనిసరి.కానీ అసలు ప్రశ్న ఇక్కడే మొదలవుతోంది. ఈ ల్యాబ్‌లోనే పరీక్ష చేయించుకోవాలి అని ఎందుకు చెప్పాలి.?
అదే పరీక్షను నాణ్యమైన మరో గుర్తింపు పొందిన ల్యాబ్‌లో తక్కువ ధరకు చేయించుకునే అవకాశం ఉంటే రోగికి ఆ ఎంపిక ఉండకూడదా.? వైద్యపరంగా ప్రత్యేకమైన కారణం ఉంటే డాక్టర్ వివరించాలి. కానీ



కేవలం రిఫరల్ ద్వారా ఆ డాక్టర్ ఆర్థిక ప్రయోజనం పొందుతున్నారనే ఆరోపణలు ఉంటే మాత్రం అది తీవ్రంగా పరిశీలించాల్సిన అంశం. ఎన్ ఎం సీ ప్రచురించిన వైద్య నైతిక నియమావళిలో రోగులను లేదా డయాగ్నస్టిక్ నమూనాలను రిఫర్ చేయడం ద్వారా కమిషన్/ఫీజు భాగస్వామ్యం చేయడాన్ని నిషేధించే నిబంధనలు ఉన్నాయి.

### ల్యాబ్ కమిషన్ కోసమైతే.. ఆ భారమంతా ఎవరి మీద.?

ఒక పరీక్షకు అసలు ధర ?500 అనుకుందాం. రోగి మాత్రం ?1,000 చెల్లించాల్సి వస్తే ఆ అదనపు భారాన్ని చివరకు ఎవరు భరిస్తారు.? రోగే కదా.. రోగి ఆరోగ్యం కోసం వెళ్లాడు. వ్యాపార లాభాల కోసం కాదు. అందుకే ప్రతి ఆసుపత్రి, ప్రతి ల్యాబ్ విషయంలో పరీక్ష అసలు ధర ఎంత.? ఇతర చోట్ల ధర ఎంత.? రిఫరల్ వ్యవస్థ ఉందా.? రోగికి తనకు నచ్చిన ల్యాబ్‌ను ఎంచుకునే స్వేచ్ఛ ఉందా.? ఆర్థిక ప్రయోజనం కోసం పరీక్షలు పెంచుతున్నారా.? అనే అంశాలపై సంబంధిత అధికారులు పర్యవేక్షణ చేయాల్సిన అవసరం ఉంది.

### మందుల విషయంలోనూ ఇదే ప్రశ్న..

డాక్టర్ మందులు రాస్తారు. ఆ మందు ఎక్కడ కొనాలి అనేది రోగి నిర్ణయించుకునే అవకాశం ఉండాలి కదా.? ఒక మెడికల్ షాపులో అదే మందు తక్కువ ధరకు దొరుకుతుంటే అక్కడ కొనుక్కుంటానంటే ఎందుకు అభ్యంతరం.? ఇక్కడ ఉన్న మెడికల్ షాపులనే కొనాలి అనే ఒత్తిడి ఎందుకు.? ఇంకా కొన్ని ప్రాంతాల్లో ఒకే డాక్టర్ పేరుతో లేదా ఆసుపత్రి పరిధిలో మెడికల్ షాపులు నిర్వహిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తుంటాయి. అక్కడ మరో ప్రశ్న, ఆ మెడికల్ షాప్‌లో అమ్మకాలు పెంచేందుకు డాక్టర్ పేరును ఉపయోగిస్తున్నారా.? అలా అయితే ఎన్ ఎం సి ప్రకారం రోగి ప్రయోజనం ఎక్కడ ఉంది.?

### డాక్టర్ రాసిన మందు.. మరో షాపులో ఎందుకు దొరకదు.?

ఇది సామాన్య ప్రజల్లో చాలాకాలంగా ఉన్న అనుమానం. కొన్ని సందర్భాల్లో డాక్టర్ రాసిన బ్రాండ్ ఒకచోట మాత్రమే లభించడం, ప్రత్యామ్నాయ బ్రాండ్లు ఉన్నప్పటికీ వాటి గురించి రోగికి సమాచారం ఇవ్వకపోవడం వంటి ఫిర్యాదులు వినిపిస్తుంటాయి. మందు అవసరం రోగికి.
మందు కొనుగోలు నిర్ణయం కూడా రోగికి అర్థమయ్యేలా ఉండాలి. అందుకే మందుల విషయంలో పారదర్శకత, సరైన ప్రిస్క్రిప్షన్, ధరలపై అవగాహన ఎంతో ముఖ్యం. ప్రచురించిన నైతిక నియమావళి వైద్యులు సాధ్యమైనంత వరకు జనరిక్ పేర్లతో మందులు సూచించాలని, రోగి ప్రయోజనానికి ప్రాధాన్యం ఇవ్వాలని పేర్కొంటుంది. డెలివరీకి రూ.2 లక్షలు... ఎందుకు.?

### ఇది మరొక పెద్ద ప్రజా ప్రశ్న,

ఒక కుటుంబంలో బిడ్డ పుట్టడం ఆనందం. కానీ అదే సమయంలో ఆసుపత్రి బిల్లు చూసి కుటుంబం అప్పులపాలైతే.? సాధారణ డెలివరీకి ఎంత.? సిజేరియన్‌కు ఎంత.? డాక్టర్ ఫీజు ఎంత.? ఆపరేషన్ థియేటర్ ఛార్జ్ ఎంత.? గది అద్దె ఎంత.? మందులు ఎంత.? ల్యాబ్, స్కానింగ్ ఖర్చు ఎంత.? ప్రతి అంశం స్పష్టంగా బిల్లులో ఉండాలి. "ప్యాకేజీ" పేరుతో ఒకే మొత్తం చెప్పడం కంటే ఖర్చుల వివరాలు పారదర్శకంగా ఉండటం అవసరం. రూ.2 లక్షల బిల్లు అంటే అది తప్పనిసరిగా అక్రమం అని చెప్పలేం---కేసు పరిస్థితి, ఆసుపత్రి సదుపాయాలు, చికిత్స విధానం, సమస్యలు, గది, మందులు తదితర అంశాలపై ఖర్చు మారవచ్చు. కానీ ఆసుపత్రి పరిధిలో ధరల పట్టిక ఉండాలి, అసలు ఖర్చు వివరాలు రోగి కుటుంబానికి స్పష్టంగా తెలియాలి అనేది మాత్రం ప్రజాస్వామ్య ఆరోగ్య వ్యవస్థలో కీలకమైన విషయం.

### జ్వరం వస్తే ఆర్.ఎం.పి దగ్గరకు వెళ్తే ఎందుకు ప్రశ్నలు.?

గ్రామీణ ప్రాంతాల్లో చిన్నచిన్న ఆరోగ్య సమస్యలకు ప్రజలకు అందుబాటులో ఉండే వైద్య సేవలపై ఆధారపడే పరిస్థితి ఉంది.అయితే ఇక్కడ కూడా ఒక విషయం స్పష్టం కావాలి,(అర్హత, రిజిస్ట్రేషన్ లేని వ్యక్తి ఆధునిక వైద్యం చేయడం చట్టబద్ధమా.? నిబంధనల ప్రకారం గుర్తింపు పొందిన అర్హత, సంబంధిత రిజిస్ట్రేషన్ లేకుండా ఆధునిక వైద్యం లేదా శస్త్రచికిత్స చేయడం అనుమతించబడదు. అందువల్ల చిన్న క్లినిక్ అయినా, పెద్ద కార్పొరేట్ ఆసుపత్రి అయినా చట్టం అందరికీ ఒకటే కావాలి. అదే సమయంలో అనుభవం ఉన్న చిన్నస్థాయి ఆరోగ్య సేవాదారులపై చర్య తీసుకుంటే, వారి పరిధి ఏమిటి.? వారు ఏ సేవలు అందించవచ్చు.? ఏవి అందించకూడదు.? అనే విషయాలను కూడా ప్రభుత్వం స్పష్టంగా ప్రజలకు తెలియజేయాలి.

### చిన్నవాడిపై కేసు.. పెద్దవాడిపై ఎందుకు నిశ్శబ్దం.?

ఇది ప్రజల్లో వినిపిస్తున్న అత్యంత తీవ్రమైన ప్రశ్న. చట్టవిరుద్ధంగా వైద్యం చేస్తే చిన్న వ్యక్తి అయినా చర్య ఉండాలి. అదే తప్పు కార్పొరేట్, పెద్ద ఆసుపత్రిలో జరిగితే కూడా చర్య ఉండాలి. సర్టిఫికెట్ ఉందని ఎవరూ చట్టానికి అతీతులు కాకూడదు. అదే విధంగా సర్టిఫికెట్ లేదని మాత్రమే ఒక వ్యక్తిపై ఆరోపణలు చేసి, నిజానిజాలు పరిశీలించకుండా చర్యలు తీసుకోవడం కూడా సరైన విధానం కాదు. చట్టం వ్యక్తిని చూసి కాదు.. తప్పును చూసి పనిచేయాలి.

### వైద్యం వ్యాపారమైతే.. రోగి పరిస్థితి ఏమిటి.?

రోగి ఆసుపత్రికి వెళ్లేది తన ప్రాణాన్ని కాపాడుకోవడానికి.కానీ అక్కడ.? ల్యాబ్ ఛార్జీలు, స్కానింగ్ ఛార్జీలు, డాక్టర్ ఫీజు, మందుల ఖర్చు, బెడ్ ఛార్జీలు, ఆపరేషన్ ఛార్జీలు, ఇతర ప్యాకేజీలు, అంటూ బిల్లు పెరుగుతూ పోతే మధ్యతరగతి, పేద కుటుంబాల పరిస్థితి ఏమిటి.? ఆరోగ్యం బాగుపడిందా అనే ఆనందం కంటే, బిల్లు ఎలా కట్టాలి అనే భయం ఎక్కువైతే అది సమాజానికి ప్రమాదకర సంకేతం.

### మరి ప్రభుత్వం ఏం చేయాలి.?

ప్రజల ఆరోగ్య ప్రయోజనాల కోసం సంబంధిత అధికారులు క్రమం తప్పకుండా పర్యవేక్షణ చేయాలి.

### ప్రధానంగా పరిశీలించాల్సిన అంశాలు:

**- ల్యాబ్ రిఫరల్స్‌పై పారదర్శకత**
రిఫరల్ కమిషన్ల ఆరోపణలపై విచారణ
- ఆసుపత్రుల ఛార్జీల వివరాల ప్రదర్శన
- డెలివరీ, సిజేరియన్ ఖర్చుల పారదర్శక బిల్లింగ్
- అవసరం లేని పరీక్షలు చేస్తున్నారా.? అనే పరిశీలన
- మందుల ప్రిస్క్రిప్షన్‌లో పారదర్శకత
- ఆసుపత్రి--మెడికల్ షాప్ సంబంధాలపై నిబంధనల అమలు
- అర్హత, రిజిస్ట్రేషన్ లేని వ్యక్తుల వైద్య సేవలపై చర్య
- కార్పొరేట్ ఆసుపత్రులు, చిన్న క్లినిక్‌లు---అందరికీ సమాన నిబంధనలు
- రోగికి తన వైద్య రికార్డులు, బిల్లులు, పరీక్షల వివరాలు అందుబాటులో ఉండేలా చూడటం

ఎన్ ఎం సీ తన అధికారిక విధుల్లో వైద్య వృత్తిలో నైతిక ప్రవర్తనను ప్రోత్సహించడం, వైద్య నిపుణుల నియంత్రణకు విధానాలు రూపొందించడం వంటి బాధ్యతలను పేర్కొంటుంది.

### చివరికి మిగిలేది ఒక్కటే ప్రశ్న...

వైద్యం సేవా రంగమా.. వ్యాపార రంగమా?డాక్టర్ ఫీజు తీసుకోవడం తప్పు కాదు. ఆసుపత్రి ఖర్చు వసూలు చేయడం తప్పు కాదు. ల్యాబ్ పరీక్షలకు ధర ఉండటం తప్పు కాదు. కానీ రోగి బలహీనతను ఆర్థిక లాభం కోసం ఉపయోగించడం మాత్రం ఎట్టి పరిస్థితుల్లోనూ సమర్థనీయం కాదు.

### రోగి అడగాల్సిన ప్రశ్నలు కూడా ఇవే.?

ఈ పరీక్ష ఎందుకు.? ఇది తప్పనిసరిగా చేయాలా.? ఎక్కడైనా చేయించుకోవచ్చా.? ఈ మందుకు ప్రత్యామ్నాయం ఉందా.? బిల్లు పూర్తిగా ఎందుకు ఇంత వచ్చింది.? ప్రతి ఛార్జీ వివరాలు బిల్లులో ఉన్నాయా.? ప్రజలు ప్రశ్నించడం మొదలుపెడితేనే పారదర్శకత పెరుగుతుంది.
అయితే ఈ ప్రశ్నలన్నీ అందరు వైద్యులను నిందించడానికి కాదు. నిజాయితీగా సేవ చేస్తున్న వైద్యుల గౌరవాన్ని కాపాడుతూనే, తప్పు చేసే వారిపై ఆధారాలతో విచారణ చేసి చర్యలు తీసుకోవాలన్నదే ప్రజల డిమాండ్. చిన్న క్లినిక్ అయినా.. కార్పొరేట్ ఆసుపత్రి అయినా..
చట్టం ముందు అందరూ సమానమే కావాలి. కార్పొరేట్ ఆసుపత్రికి కానీ డాక్టర్ కు కానీ రోగి జేబు కాదు.. రోగి ఆరోగ్యం, ప్రాణమే మొదటి ప్రాధాన్యత కావాలి.. ఇది ప్రభుత్వం గుర్తించాలి.

## పాతబస్తీలో అంబరాన్నంటిన బోనాల జాతర

**- లాల్ దర్వాజ మహంకాళి అమ్మవారి దర్శనానికి పోటెత్తిన భక్తులు**





హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) హైదరాబాద్ నగరంలో వైభవంగా ఆషాడ బోనాలు జరుగుతున్నాయి. బోనాల ఉత్సవాలు ముగింపు దశకు చేరుకోవడంతో లాల్‌దర్వాజా సింహవాహిని మహంకాళి ఆలయం వద్ద భక్తుల సందడి నెలకొంది. అమ్మవారికి బోనాలు సమర్పించడానికి మహిళలు పోటెత్తారు. లాల్ దర్వాజ వద్ద వైభవంగా శోభాయాత్ర, ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. జులై 16న గోల్కొండ కోటలో ప్రారంభమైన ఆషాడ బోనాలు నేడు పాతబస్తీలోని లాల్ దర్వాజ శ్రీ సింహవాహిని మహంకాళి అమ్మవారి వేడుకలతో ముగియనుంది.

ఆషాఢమాసం సందర్భంగా హైదరాబాద్ పాతబస్తీలోని లాల్‌దర్వాజా సింహవాహిని మహంకాళి ఆలయంతో పాటు నగరవ్యాప్తంగా బోనాల పండుగ కన్నులపండువగా జరుగుతోంది. భక్తులు భారీగా తరలివచ్చి అమ్మవారికి బోనాలు సమర్పిస్తున్నారు. డప్పు చప్పుళ్లు, పోతురాజుల విన్యాసాలు, నామస్మరణలతో లాల్‌దర్వాజా పరిసరాలు మార్మోగుతున్నాయి. మంత్రులు, మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు, సినీ సెలబ్రిటీలు అమ్మవారిని దర్శించుకుని ఆశీస్సులు తీసుకుంటున్నారు. దర్శకుడు సందీప్ రెడ్డి వంగ, హీరోలు విజయ్ దేవరకొండ, ఆనంద్ దేవరకొండ లాల్ దర్వాజ మహంకాళి అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు.అంబర్‌పేట మహంకాళి అమ్మవారిని మంత్రి సీతక్క దర్శించుకుని, పట్టువస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆమెతో పాటు ప్రభుత్వ సలహాదారు వి.హనుమంతరావు కూడా ఉన్నారు. భక్తుల భద్రత మరియు ట్రాఫిక్ క్రమబద్ధీకరణ కోసం నగరవ్యాప్తంగా ఆలయాల వద్ద 2,500 మంది పోలీసులు, 100 సీసీ కెమెరాలతో పోలీసులు భారీ భద్రతను ఏర్పాటు చేశారు.

బోనాల పండుగ సందర్భంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ శ్రీ అక్కన్న మాదన్న మహంకాళి అమ్మవారిని, లాల్ దర్వాజా సింహవాహిని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. తెలంగాణ రాష్ట్ర ఆడబిడ్డలకు, అన్నదమ్ములకు బోనాల పండుగ శుభాకాంక్షలు తెలిపారు. అమ్మవారి ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై ఉండాలని, హైదరాబాద్‌లో వ్యాపారాలు బాగా జరగాలని కోరుకున్నారు. అమ్మవారి ఆశీస్సులతో వర్షాలు సమృద్ధిగా పడి, రైతులందరూ సంతోషంగా ఉండాలని మొక్కుకున్నారు. బోనాల పండుగ సందర్భంగా తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు మల్కాజిగిరిలోని శ్రీ ఉజ్జయిని మహాకాళి అమ్మవారి ఆలయాన్ని దర్శించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి దివ్య ఆశీస్సులు పొందాను.

## కృష్ణమ్మా ఒడిలో గోదారమ్మ

**- ప్రకాశం బ్యారేజీని పరిశీలించిన సీఎం చంద్రబాబు**



**అమరావతి (ప్రశ్న న్యూస్)**(ముఖ్యమంత్రి చంద్రబాబు విజయవాడలోని ప్రకాశం బ్యారేజీ వద్ద నీటి ప్రవాహాన్ని ఆకస్మికంగా పరిశీలించారు. విజయవాడలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవ కార్యక్రమంలో పాల్గొని, తిరిగి ఉండవల్లిలోని తన నివాసానికి వెళుతున్న సమయంలో, మార్గమధ్యంలో తన కాన్వాయ్‌ను బ్యారేజీపై కొద్దిసేపు నిలిపివేశారు. బ్యారేజీ వద్ద నీటి లభ్యత, డెల్టాకు నీటి విడుదల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా, పట్టిసీమ ఎత్తిపోతల పథకం ద్వారా ఈ సీజన్‌లో ఇప్పటివరకు 17.52 టీఎంసీల గోదావరి జలాలను విజయవంతంగా కృష్ణా నదికి తరలించినట్లు జలవనరుల శాఖ అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. మరోవైపు, ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న భారీ వరదల కారణంగా ఇదే సీజన్‌లో సుమారు 521 టీఎంసీల గోదావరి నీరు సముద్రంలోకి వృథాగా కలిసిపోయిందని తెలిపారు.పట్టిసీమ ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాలు సమృద్ధిగా కృష్ణా నదికి చేరుతున్నాయని, ఈ నేపథ్యంలో ప్రకాశం బ్యారేజీ నుంచి కృష్ణా డెల్టాలోని ఆయకట్టుకు పూర్తిస్థాయిలో సాగునీటిని అందిస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని నీటి యాజమాన్యాన్ని సమర్థవంతంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం ప్రకాశం బ్యారేజీ నుంచి డెల్టాలోని వివిధ కాలువలకు మొత్తం 7,158 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. ఇందులో కృష్ణా తూర్పు ప్రధాన కాలువకు 3,928 క్యూసెక్కులు, కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు 3,115 క్యూసెక్కులు, గుంటూరు ఛానల్‌కు 115 క్యూసెక్కుల చొప్పున నీటిని అందిస్తున్నట్లు వారు ముఖ్యమంత్రికి నివేదించారు.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.no : 12-13-1282, Flat No : 407, Mehtab Arcade, Tarnaka Main Road, Opp.Ganesh Temple, Secunderabad - 500017, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588